వార్త

ఆదివారం

26 జనవరి, 2025

# పట్టు బిగిస్తున్న విష వైరస్‌లు!



# తారాతీరం

## 'రాజా సాబ్' విడుదల వాయిదా?



'కల్కి 2898 ఏడీ' చిత్రం తర్వాత టాలీవుడ్ అగ్ర కథానాయకుడు ప్రభాస్ నుంచి వస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. మారుతి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం విడుదల తేదీ వాయిదా పడినట్టు సమాచారం. వాస్తవానికి 'రాజా సాబ్' చిత్రం ఏప్రిల్ 10న విడుదల కావాల్సి ఉంది. అయితే ఆ తేదీన సినిమా విడుదల కావడం లేదని తెలుస్తోంది. కొత్త తేదీ ఖరారు చేశాక ప్రమోషన్ కార్యక్రమాలు ముమ్మరం అవుతాయని పేర్కొన్నారు. 'రాజా సాబ్' చిత్రంలో ప్రభాస్ జోడీగా నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలకపాత్ర పోషిస్తున్నారు. తమిళ నటి మాళవికా మోహనన్‌కు ఇది తెలుగులో తొలి చిత్రంకానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నాడు.

## ఏప్రిల్‌లో 'ఘాటీ' రిలీజ్

క్రిష్ దర్శకత్వంలో సీనియర్ నటి అనుష్క శెట్టి నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటి'. ఏప్రిల్‌లో విడుదలకానున్న ఈ మూవీలో ఓ కీలక పాత్రలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు కనిపించనున్నారు. ఈ పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను చిత్రం యూనిట్ విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌ను యాక్షన్, బైక్ స్టంట్స్‌తో ఆసక్తికరంగా మలిచారు. చివరలో అనుష్క కూడా బైక్ నడుపుతూ కనిపించారు. ఇక ఈ చిత్రంలో అనుష్క పాత్ర సైతం చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని ఇప్పటికే విడుదలైన ఈ మూవీ టీజర్ చూస్తే తెలుస్తోంది. ఈ సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. 'ఘాటి' మూవీ తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది.



ఆదివారం వార్త

26 జనవరి, 2025

## కదంబం

సంఘీ'భావం....5

ఘనత సాధించిన ఇస్రో

కవర్ స్టోరీ..6

పట్టు బిగిస్తున్న
విష వైరస్‌లు

ఈవారం కవిత్వం...12

నవతంత్రం

పలుకే బంగారమాయెనా! 15

ఘనమైనది భారత రాజ్యాంగం.. 18

కథ..20

పరామర్శ

సాహిత్యం...23

నీ బాసల్నే నీ బతుకున్నది

అనుభవాలే జీవిత పాఠాలు.. 24

అరుదైన ఆలయం.. 28

ఇంకా...

ముగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

## మంచి ముత్యాలు

చదువుకుంటే ఉద్యోగం స్థిరంగా ఉంటుంది.
చదువును కొంటే ఉద్యోగం ఊడిపోతుంది.

# తాజా వార్తలు

## వంతెనలో వింతలెన్నో..

సముద్రంలో 2.08 కి.మీ. పొడవు ఉండే ఈ వంతెన దిగువన ఓడల రాకపోకలకు వీలుగా కీలకమైన వర్టికల్ లిఫ్ట్ ఉంటుంది. దీనికి రెండు వైపులా నిలువు స్తంభాలుంటాయి. వాటికి 310-320 టన్నుల బరువున్న దూలాలు వేలాడుతుంటాయి. రెండు దూలాల బరువు 625 టన్నులు. మొత్తం లిఫ్ట్‌లో సుమారు 35 టన్నుల బరువు ఎత్తడానికి మత్రమే విద్యుత్ అవసరం. మిగతా భారాన్ని కౌంటర్ వెయిట్‌లు నియంత్రిస్తాయి. బ్రిడ్జి ఎత్తాల్సి వచ్చినప్పుడు కిందలిఫ్టులు, మోటార్ల సాయంతో అవలీలగా పైకొస్తుంది. ఇదంతా రిమోట్ కంట్రోల్



ద్వారా నడుస్తుంది. ఇక 2.08 కి.మీ. వంతెనలో 99 దిమ్మెలు 18.3 మీటర్ల పొడవులో ఉన్నాయి. ఒక్కో దిమ్మెకు అనుబంధంగా 3 గుండ్రటి పైల్స్ నిర్మించారు. ఇవి పటిష్టంగా ఉండేలా, సముద్రం అడుగున గట్టి నేల తగిలే వరకూ 25-35 మీటర్ల లోతున పునాదులు తీశారు. కొన్ని చోట్ల భారీ రాళ్లు రాగా, వాటిలోనే కాంక్రీట్ చొప్పించారు.  కెరటాలు వంతెనపైకీ వస్తుంటాయి. పాత వంతెన ఇనుము తుప్పుపట్టి, మందం కరిగిపోయింది. కొత్త వంతెనకు ఆ సమస్య రాకుండా నిర్మాణాలపై 3 పొరలుగా పాలీ సిలోక్సేన్ పెయింటింగ్ పూత వేశారు. 58 యేళ్ల వరకు ఢోకాలేదు. చిన్నచిన్న మరమ్మతులతో వందేళ్ల వరకూ ఇబ్బందిలేదు. సముద్రంలోని దిమ్మెలు పాడవకుండా చుట్టూ కేసింగ్ విధానంలో ఐరన్ చట్రాలతో కాంక్రీట్ వేశారు. ట్రాక్ పక్కన నడిచే దారుల్లో ఉప్పు చేరకుండా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో పాటు ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్ వాడారు. వర్టికల్ లిఫ్ట్ వంతెనకు ఒక్క బోల్టూ వాడలేదు. వెల్డింగ్‌తోనే తయారుచేశారు. వంతెన మొత్తాన్ని స్కాడా సెన్సర్లతో అనుసంధానించారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com





# పిల్లలను దోమకాటుకు దూరంగా..





వాతావరణంతో తేమ ఎక్కువై దోమల బెడద మొదలవుతుంది. వీటి బారిన పడకుండా చిన్నారు లను రక్షించాలంటే దోమతెర వినియోగం తప్పనిసరి. లేదంటే పాపాయి తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఇంటి గార్డెన్ సహా ప్రయాణాల్లోనూ ఉపయోగించేలా రకరకాల దోమతెరలు పిల్లల కోసం ప్రత్యేకంగా లభిస్తున్నాయి.



**నవజాత శిశువులకు...**



పసిపిల్లల కోసం మంచం పక్కగా అటాచ్డ్ బేబీ బెడ్‌పై ఉండే దోమతెరలే కాకుండా, ఇప్పుడు కొత్తగా ఫోల్డబుల్ నెట్ కూడా వస్తున్నాయి. ముందుగది లేదా వరండాలో పనిలో ఉన్నప్పుడు దోమలుంటాయనే భయం లేకుండా హాయిగా అక్కడే నిద్రపుచ్చొచ్చు. దీనికోసమే ప్రత్యేకంగా దోమతెర అటాచ్డ్‌గా ఉండే చిన్న బెడ్ దొరుకుతోంది. తేలికగా దీన్ని మడిచేయొచ్చు.




**స్ట్రోలర్‌కు..** ఏడాదిలోపు చిన్నారులను స్ట్రోలర్‌లో షాపింక్‌కో, సాయంకాలాలు ఆరుబయటకో తీసుకెళ్లేటప్పుడు దోమల భయం ఉంటుంది. దీనికి పరిష్కారంగా స్ట్రోలర్‌గా అటాచ్డ్‌గా దోమతెర వేసే సౌకర్యం వచ్చింది. దీంతో చిన్నారులు దోమ కాటుకు గురికారు.అలాగే ప్రయాణాల్లోనూ పాపాయికి పడకతో పాటు బెడ్‌కు అటాచ్డ్‌గా దోమతెర సౌకర్యం ఉంటోంది. అవసరం లేకపోతే దీనిని ఫోల్డ్ చేస్తే బ్యాగులా భుజానికి తగిలించుకోవచ్చు.

భలేగున్నాయి కదూ!



# 'సంఘీ' భావం



# ఘనత సాధించిన ఇస్రో

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ విజయాల పరంపర కొనసాగిస్తూనే ఉంది. ప్రపంచంలోని అగ్రదేశాలకు ధీటుగా తన సత్తాను చాటుతోంది. 2025 మొదట్లోనే రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేయడం ద్వారా చరిత్ర సృష్టించింది. ఇస్రో ప్రయోగించిన రెండు ఉపగ్రహాలను విజయవంతంగా అనుసంధానం చేసి సత్తా చాటింది. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్లు ఇస్రో ప్రకటించడం భారతదేశానికి గర్వకారణంగా నిలిచింది. ఈ ఘనత సాధించిన నాలుగో దేశంగా భారత్ అవతరించింది. గత డిసెంబరు 30న తిరుపతి జిల్లాలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్ షార్‌లో నుంచి పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సీ60లో జంట ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్‌వీ బయలుదేరిన 15.09 నిమిషాలకు స్పేడెక్స్1బి, 15.12 నిమిషాలకు స్పేడెక్స్1ఎ రాకెట్ నుంచి విడిపోయాయి. ఆ తర్వాత వీటి డాకింగ్ కోసం మూడుసార్లు ప్రయత్నించినా సక్సెస్ కాలేదు. పలు కారణాల వల్ల ఇది వాయిదా పడుతూ వచ్చింది. ఒక్కొక్కటీ 220 కేజీల బరువుండే ఈ రెండు శాటిలైట్ల మధ్య దూరం 20 కిలోమీటర్లు ఉండేలా లాంచింగ్ సమయంలోనే జాగ్రత్తలు తీసుకున్నారు. తర్వాత క్రమంగా వీటి మధ్య దూరాన్ని తగ్గించుకుంటూ వచ్చి 7వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో అనుసంధానం చేయాలని భావించారు. అయితే చేజర్ ఉపగ్రహంలోని అనుసంధాన లింకు తెరుచుకోకపోవడంతో ఆ ప్రక్రియను జనవరి 9కి వాయిదా వేశారు. ఆ సమయంలో ఆ రెండు ఉపగ్రహాలు 1.5 కి.మీ దూరంలో ప్రయాణిస్తున్నాయి. వాటిని సాంకేతిక పరిజ్ఞానంతో 1.3 కి.మీ దగ్గరికి తీసుకొచ్చారు. రెండింటిమధ్య దూరాన్ని 225 మీటర్లకు తగ్గించేందుకు ప్రయత్నించింది. వాటి వేగం అదుపులోకి రాకపోవడంతో అనుసంధాన ప్రక్రియను మళ్లీ జనవరి 11కి వాయిదా వేశారు. ఎట్టకేలకు రెండు ఉపగ్రహాలనూ 230 మీటర్ల దగ్గరకు తీసుకొచ్చారు. జనవరి 12న ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్లకు తీసుకొచ్చారు. కొంత సమయం తర్వాత ఉపగ్రహాల వేగాన్ని నియంత్రించుకుంటూ రెండింటినీ 10 అడుగుల దగ్గరకు చేర్చారు. ఎట్టకేలకు గురువారం ఉదయం 9 గంటలకు నెమ్మదిగా రెండింటినీ అనుసంధానించారు.

చివరకు గురువారం వీటి అనుసంధాన ప్రక్రియను చేపట్టారు. దీనికోసం రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్ల నుంచి 3 మీటర్లకు తీసుకొచ్చి డాకింగ్‌ను మొదలుపెట్టారు. ఈ ప్రయత్నం విజయవంతమైనట్లు ఇస్రో చెప్పింది.

ఇప్పటివరకు చైనా, రష్యా, అమెరికా మాత్రమే అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేస్తున్నాయి. తాజా ప్రయోగంతో ఈ తరహా సాంకేతికతలో భారత్ కూడా వాటి సరసన చేరింది. రాబోయే సంవత్సరాల్లో మన దేశ ప్రతిష్ఠాత్మక అంతరిక్ష ప్రయోగాలకు ఇది కీలక మెట్టుగా నిలవబోతోంది. భవిష్యత్తులో చేపట్టబోయే భారతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రయాన్ 4, గగన్‌యాన్ ప్రయోగాలను ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించేందుకు బాటలు వేస్తుందని భావిస్తున్నారు. ఉపగ్రహాల డాకింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో భారత్ సొంత అంతరిక్ష కేంద్ర ఏర్పాటుకు మార్గం సుగమమైందని చెప్పవచ్చు. అదేవిధంగా భారత్ చేపట్టబోయే గగన్‌యాన్‌కు కూడా డాకింగ్ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రజ్ఞులు ప్రకటించారు. మరోపక్క కేంద్ర ప్రభుత్వం ఇస్రో పరిశోధనలకు పూర్తి స్థాయి సహకారాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా శ్రీహరికోటలో ఇస్రో కోసం మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో రూ.3,985 కోట్ల పెట్టుబడితో మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. అంతరిక్ష మౌలిక సదుపాయాల్లో దేశానికి ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. మొదటి, రెండో లాంచ్ ప్యాడ్లను పరిశీలిస్తే, ఈ రెండింటి కంటే ఇది చాలా ఎక్కువ సామర్థ్యాన్ని కలిగి ఉంది. కొత్త లాంచ్ ప్యాడ్ ఇస్రో నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీహరికోటలో ప్రయోగ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, రెండో లాంచ్ ప్యాడ్‌కు బ్యాకప్‌గా పనిచేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఈ కొత్త లాంచ్ ప్యాడ్ భవిష్యత్తులో భారత మానవ అంతరిక్ష యాత్రలకు ఇస్రో సామర్థ్యాన్ని పెంచుతుందని, నాలుగేళ్లలో ఇది పూర్తవుతుందని ప్రభుత్వ ప్రకటన తెలిపింది. మూడో లాంచ్ ప్యాడ్ కేవలం నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జిఎల్‌వి) మాత్రమే కాకుండా సెమీ క్రయోజనిక్ స్టేజ్‌తో లాంచ్ వెహికల్ మార్క్ 3 (ఎల్వీఎం3) వాహనాలకు, అలాగే ఎన్జీఎల్వీ స్కేల్ అప్ కాన్ఫిగరేషన్లను సపోర్ట్ చేసేలా డిజైన్ చేయబడుతుంది. ఈ ప్రాజెక్టులో విస్తృతమైన పరిశ్రమ భాగస్వామ్యం ఉంటుంది. మునుపటి లాంచ్ ప్యాడ్లను ఏర్పాటు చేయడంలో ఇస్రో అనుభవాన్ని ఉపయోగించడం, ఇప్పటికే ఉన్న లాంచ్ కాంప్లెక్స్ సౌకర్యాలను గరిష్టంగా ఉపయోగించడం కూడా ఇందులో భాగం. దీనితో తిరుపతి జిల్లాలో సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం మరింత సాంకేతిక అభివృద్ధిని సాధించినట్లు అయ్యింది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

**జలుబు, దగ్గు, పడిశం గురించి తెలుగులో ఒక సామెత బహుళ ప్రచారంలో ఉంది. మందులు వాడితే ఏడు రోజుల్లో తగ్గుతుంది. వాడకపోతే వారం రోజులలో తక్కువ అవుతుంది. ఏదైనా రెండు ఒకటే కదా!**




# పట్టు బిగిస్తున్న విష వైరస్‌లు!

**కవర్ స్టోరీ**


బండారు రామ్మోహన రావు

అందుకే జలుబు, దగ్గు, పడిశం గురించి మనం పెద్దగా ఆందోళన పడం కానీ కోవిడ్-2019 వచ్చిన తర్వాత పాత జలుబుకి మనకు కొత్త భయాలు ఏర్పడ్డాయి. ఏది ఏదైనా మహాకవి గురజాడ అప్పారావు ఏనాడో కొన్ని సంవత్సరాల క్రితం 'కన్యాశుల్కం' నాటకంలో రాసినట్లుగా అనుభవానికి వస్తే కానీ తత్వం పడదు కదా! కోవిడ్ 19 మనకు జీవితం అంటే ఏమిటి? అనే విషయంలో పాఠాలు, ఎన్నో గుణపాఠాలు నేర్పింది. కోవిడ్ 19 మొదటి దశలో ప్రపంచవ్యాప్తంగా అన్ని అభివృద్ధి చెందిన దేశాలలో ఎక్కువ మంది మరణించారు. మన భారతదేశంలో మాత్రం మొదటి దశలో ఎక్కువ మరణాలు సంభవించలేదు కానీ రెండవ దశ 2020-21లో వచ్చిన సందర్భంగా ఎక్కువ ప్రాణ నష్టం జరిగింది. దాంతో చిన్న జలుబు చేసినా కూడా మనం భయపడే పరిస్థితి ఏర్పడింది. ఆ క్రమంలోనే కొత్తగా 2024 సంవత్సరం చివర్లో మన దేశంలోకి ప్రవేశించిన హెచ్ఎంపివి వైరస్ మనల్ని అంతగా భయపెడుతోంది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యుహెచ్ఓతో పాటు మనదేశంలోని ఆరోగ్య శాఖ సంక్రమిత వ్యాధుల నివారణకు పని చేసే ఆరోగ్య సంస్థలు పరిశోధకులు కూడా హెచ్ఎంపివితో ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని మనకు భరోసా ఇస్తున్నాయి. కానీ కోవిడ్ 19తో దెబ్బతిన్న ప్రాణం కదా.. ఆహార, మైదానాలు ప్రకృతిలోని 84 లక్షల జీవరాసులకు ఉన్నట్లే మనకూ ఉన్నాయి కనుక భయపడుతున్నాం.

ఇంతకుముందే చెప్పుకున్నాం. హెచ్.ఎం.పీవీ. అంటే హ్యూమన్ మెటాప్సిమో వైరస్. నిజంగా ఇది ప్రాణాంతకమేనా లేక అదేదో సినిమాలో చెప్పినట్లు గుండెలో చిన్న హోల్ అని తీసిపారేసేదేనా అని మనం ఆలోచించాలి. శ్వాస కోస వ్యాధులు సాధారణంగా విస్తృతమైన భయాందోళనకు కారణం అవుతాయి. ప్రజలు పెద్దగా ఆందోళన చెందకుండానే ఈ వైరస్‌ను నియంత్రించగలరని భారత ఆరోగ్య సంస్థ చెబుతుంది. అందుకనే భారత ప్రభుత్వం వ్యాధి వ్యాప్తి చెందకుండా కొన్ని జాగ్రత్తలను ప్రకటించింది. అందులో ముఖ్యంగా గతంలో మనం కరోనా ప్రబలిన సమయంలో ఏవైతే జాగ్రత్తలు పాటించామో అవే జాగ్రత్తలను ప్రస్తుతం మన ఆరోగ్య సంస్థలు కూడా చెబుతున్నాయి. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, తుమ్మినప్పుడు లేదా తగ్గినప్పుడు నోరు నోటికి చేయి అడ్డం పెట్టుకోవడం, ఎదుటివారికి షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడం, వీలైతే ఎదుటి వ్యక్తికి దగ్గరగా నిలబడి మాట్లాడకపోవడం, బహిరంగ ప్రదేశాలకు వెళ్ళినప్పుడు ముక్కు, నోరుకి మాస్క్ ధరించడం ఇలాంటి జాగ్రత్తలు మనం పాటించాలని ఆరోగ్య సంస్థలు చెబుతున్నాయి. 'ఎల్ల భాషల కెల్ల తల్లి సంస్కృతంబు' అన్నట్లు దానితో పోలిక లేకపోయినా అన్ని వైరస్ జబ్బులకు చైనా పట్ల, చైనా వైపు మనం వేలెత్తి చూపించాల్సిన అవసరం వస్తుంది. చైనాలో ఏం జరుగుతుందో మిగతా ప్రపంచానికి తెలియక పోవడంవల్ల ఈ అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

చైనాలో ఈ హెచ్ఎంపివి వైరస్ వల్ల లక్షలాదిమంది జబ్బు పడ్డారని ఆరోగ్య జాగ్రత్తలు తీసు కోకుంటే ఇంకా పెరిగే అవకాశం ఉందనీ, అలాగే చైనాలో ఆయా ఆసుపత్రుల్లో ఉన్న రద్దీని చూపెడుతూ అనేక ఫోటోలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ దశలో చైనాలో చెలరేగిన ఈ జబ్బు మనకు కూడా వచ్చే అవకాశం ఉందని తెలుపుతున్నాయి. అలాగే ప్రపంచంలో మొదట చైనాలో ఈ జలుబులు భయాందోళనకు గురి చేస్తే చైనా ద్వారా డైరెక్ట్‌గా మనకు కేరళ ఇలాంటి వైరల్ ఫీవర్లకు గేట్ వే ఆఫ్ ఇండియాగా మారిందని ఎంతవరకు నిజమో మనకు తెలియదు కానీ మరొక అపవాదు కూడా ఉంది. అందుకే ఈ వ్యాధి లక్షణాల గురించి కూడా సరైన ప్రచారం చేయకపోతే మరింత భయపడే అవకాశం ఉంది గనుక మనం దీని గురించి కూడా మాట్లాడుకుందాం: ఉదాహరణకు హెచ్ఎంపివి జలుబు మన శరీరంలో ఎలాంటి మార్పులకు దారితీస్తుంది, ఎలా గుర్తు పట్టొచ్చు అనే విషయం మాట్లాడుకుంటే తుమ్ములు, గొంతు మంట, పొడిదగ్గు, తడి

దగ్గుతో పాటు కొన్ని సందర్భాల్లో జ్వరం కూడా ఉంటుంది. ఇది ఒక రకంగా ఫ్లూతో సమానమైన జలుబు. కొంచెం ఎక్కువ అయితే నిమోనియాకు దారి తీయవచ్చు. 2024 చివర్లో మనకు బెంగళూరులో ఇద్దరు శిశువులకు ఈ వైరస్ సోకినట్లు ఆసుపత్రులు ఆరోగ్య సంస్థలు వెల్లడించాయి. ఆ తర్వాత అదిగో పులి అంటే ఇదిగో తోక లాగా ఢిల్లీలో ఏం జరుగుతోంది, బొంబాయిలో ఏం జరుగుతోందనే వార్తలు కూడా మనను చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.




## ఏ వయసు వారికి?

తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ఎదుటి వారికి ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలకు, 65 ఏళ్ల దాటిన వృద్ధులకు ఈ వ్యాధి ఎక్కువ మందికి సోకే అవకాశం ఉందని అంటున్నారు. మెడికల్ టర్మినాలజీ ప్రకారం కూడా ఏ జబ్బు అయినా పిల్లలకు వృద్ధులకు తొందరగా సోకే అవకాశం ఉందంటారు.

గతంలో కోవిడ్ 19కి తగ్గట్టుగా మనలో "హెర్డ్ ఇమ్యూనిటీ" సామూహిక రోగనిరోధక శక్తి పెరిగిన తర్వాత ఈ జలుబులు జబ్బులు వాటంతటవే మన శరీరాలకు అలవాటు అవుతాయని డాక్టర్లు చెబుతున్నారు. దాంతో అందరికీ ప్రస్తుతం ఉన్న హెచ్ఎంపీవి వైరస్ సోకితే ఆ తర్వాత పెద్ద ప్రమాదం ఏమీ లేదని కూడా అంటున్నారు. అలాగే గతంలో కొవిడ్ 19 లాగా ఇది జనాల్లో పెద్దగా ప్రభావితం చూపదని కూడా చెబుతున్నారు. అందుకే నేను దీనికి పాత జలుబు కొత్త భయాలు అనే పేరు పెట్టాను. మనిషికి ప్రాణం మీద తీపి ఉంటుంది కదా. గతంలో ఒక డాక్టర్ అన్నాడట వెయ్యి రణాలు (ఆపరేషన్ల లేక సర్జన్లు)చేసిన కోసిన నేను నా శరీరంపై ఉన్న పులిపిరి తీయించుకోవడానికి భయపడతాను.. అనే మాట బహుళ ప్రచారంలో ఉంది. అలా చైనా నుండి వయా కేరళ ద్వారా మన దేశంలోకి అనేక జబ్బులు వ్యాపిస్తున్నాయి.. అనే అపప్రద కూడా కేరళ రాష్ట్ర విషయంలో ఉంది.



ఇది శాస్త్రీయంగా నిలవలేదు కానీ తమదాకా వస్తే అనే భయం మాత్రం ప్రజల్లో ఉంటుంది కనుక మన జాగ్రత్తలో మనం ఉండాలని అనుభవజ్ఞులు చెబుతున్నారు. అందుకనే ఒక్కోసారి డాక్టర్ల కంటే పేషెంట్లకి అనుభవం ద్వారా జబ్బుల విషయాలు మందుల వివరాలు ఎక్కువ తెలుస్తాయి. అలాగని సొంత వైద్యం చేస్తే ఆ మాత్రలు వైకుంఠ యాత్రకు దారితీస్తాయి కూడా.

అందుకనే గురజాడ అప్పారావు గారు రాసిన "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అనే గేయంలో ఉన్న విధంగా "సొంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి సాయపడవోయ్" అన్నట్లుగా సొంత వైద్యం మంచిది కాదు అని మనం అన్వయించుకోవాలి. హెచ్ఎంపివి పైన గత రెండు నెలలుగా మన దేశంలో జరుగుతున్న చర్చలు మొదట భయాందోళనలకు గురిచేసినా హెచ్ఎంటీవీ కేసులు మనం భయపడినంతగా పెరగకపోవడం ఒక శుభ పరిణామం. ఉన్న కేసుల్లో కూడా ప్రాణ నష్టం జరగకపోవడంతో కొంత ఊపిరి పీల్చుకుంటున్నాం. అలాగే ఆరోగ్య సంస్థలు, డాక్టర్లు కూడా కరోనా టైంలో భయపెట్టినట్లుగా మనను భయపెట్టడం లేదు. వారు భయపెట్టినా మనం భయపడే స్టేజి దాటిపోయాం. ఏదైతే అది అయిందని "హెర్డ్ ఇమ్యూనిటీ" కోసమే మనం ప్రయత్నిస్తున్నాం.




అయినా చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్నట్లు గతంలో కోవిడ్ 19 అనుభవం రీత్యా మన భారత ప్రభుత్వం ఎక్కువమంది హెచ్ఎంపీవీ వైరస్ సోకి మాస్‌గా అనారోగ్యం పాలవుతే వారికి సహాయం చేయడానికి తగినంత ఆక్సిజన్, పడకలను కూడా ఏర్పాటు చేశామని ప్రజలకు హామీ ఇస్తోంది. ఆరోగ్య అధికారులు ఈ సమస్య పట్ల అప్రమత్తంగా ఉన్నారని ప్రభుత్వాలు ప్రజలకు భరోసా ఇస్తున్నాయి. అంతకంటే ముఖ్యంగా ఇది కొత్త జబ్బు కాదని, ప్రమాదకరమైన సమస్య రాదని ప్రజలకు భరోసా ఇస్తూనే తమ తమ జాగ్రత్తల్లో తాము ఉండాలని ప్రభుత్వాలు ప్రజలకు హెచ్చరిక చేస్తున్నాయి.

ఇలాంటి శ్వాస కోశ వ్యాధులకు మనదేశంలో ఇప్పటికే అనేక రకాలుగా సంసిద్ధంగా ఉన్నాం. ఎందుకంటే గతంలో కోవిడ్ 19 సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది మరణిస్తే మన దేశంలో మరణాల సంఖ్య ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో ఆయా దేశాల జనాభాతో పోల్చుకుంటే 140 కోట్ల మంది భారత ప్రజలకు కోవిడ్ 19 సోకిన శాతం చూసుకుంటే తక్కువ ఉన్నట్టే లెక్క. అప్పుడు వ్యాక్సిన్ ఉత్పత్తిలో అలాగే చాలా అభివృద్ధి చెందిన దేశాలతో పాటు పేద దేశాలకు కూడా మనం వ్యాక్సిన్ సరఫరా చేసిన దేశంగా కూడా మనం ఉన్నాం. కానీ ఆ వ్యాక్సిన్లే ప్రస్తుతం ప్రాణాంతకంగా మారుతున్నాయని కూడా ఆరోగ్య సర్వేలు తేటతెల్లం చేస్తున్నాయి.



## వ్యాక్సిన్ల ప్రభావం

కొన్ని కంపెనీల వ్యాక్సిన్లు మొదటి రెండు డోసులు కాకుండా చివరగా ముఖ్యంగా వృద్ధులకు ఇచ్చిన థర్డ్ డోస్ వ్యాక్సిన్ కూడా గుండె జబ్బులకు కారణమై మరణిస్తున్నారనే అంశం కూడా వైద్య సంస్థలు వెల్లడించాయి. అందుకనే ఇటీవల గుండెపోటు మరణాలు హార్ట్ ఎటాక్‌లతో పాటు ముఖ్యంగా యువతలో కార్డియాక్ అరెస్ట్‌లు కూడా పెరిగాయని మరొక సర్వే వెల్లడించింది.
అన్న వస్త్రాలకు పోతే ఉన్న వస్త్రాలు ఊడినట్లుగా ఈ వ్యాక్సిన్లు ఇలా కూడా నష్టం చేశాయని కూడా మనకు అనిపిస్తుంది. ఏదేమైనా కోవిడ్ 19తో ఆస్పత్రి పాలై కరోనాతో పోరాడి ఎందరో మరణించారు.




## ఆందోళన వద్దు..

అందుకనే హెచ్‌ఎంపివి వైరస్‌తో భారతీయులు ఆందోళన చెందాల్సిన అవసరం ఉందా లేదా అనే దాంతో ముగిస్తాను. ముఖ్యంగా చలికాలం అనేక శ్వాసకోశ వ్యాధులకు మనం శరీరం ఆలవాలమవుతుందనేది డాక్టర్లు చెబుతున్నారు. చలికాలం కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఇలాంటి వైరస్‌లు వ్యాప్తి చెందకుండా ఉంటాయని వారంటున్నారు.

## జాగ్రత్తలు

శీతాకాలం "ఫ్లూ" సీజన్లో ఇది అంటూ వ్యాధి కాకుండా ఉండాలంటే కరోనా సమయంలో మనం తీసుకున్న జాగ్రత్తలు అన్నింటిని తప్పక తీసుకోవాలి. దాంతోపాటు జనం ఎక్కువగా గుమికూడే సామూహిక కార్యక్రమాలలో పాల్గొనడం తగ్గించాలి. మన దేశంలో పరిస్థితి ఎంత అదుపులో ఉన్నా కూడా ప్రయాగ్ రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతున్న అలహాబాద్‌కు వచ్చే 45 రోజులు జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. జనవరి 13వ తేదీన మొదలైన మహాకుంభ మేళాలో దాదాపు యాభై కోట్ల మంది ప్రజలు భక్తులు పాల్గొంటారని తెలుస్తోంది. అక్కడ కూడా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.
గతంలో కరోనా సమయంలో ఢిల్లీలోని ఒక మసీదులో జరిగిన సమ్మేళనం కారణం అయిందని ప్రచారం జరిగింది. అలా కుంభ మేళా గురించి కూడా ప్రచారం జరగకుండా ఉండాలంటే అక్కడ కూడా తగిన ఏర్పాటు చేయాలి. కుంభమేళాకు వచ్చేవారి కోసం పారిశుద్ధ్య మొదలైన ఏర్పాట్లు బాగా చేశారు.
ఏదేమైనా జనం ఎక్కువ సంఖ్యలో గుమిగూడే చోట ఇంకా ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలిసిన అవసరం ప్రభుత్వాలపై ఉంది. అలాగే ప్రజలమైన మన మీద కూడా ప్రభుత్వాలు చెబుతున్న ఆరోగ్య సూత్రాలు పాటించాల్సిన బాధ్యత కూడా ఉంది. ప్రజారోగ్యం బాధ్యత కేవలం ప్రభుత్వాలదే కాదు ప్రజలది కూడా. ■



కోట దామోదర్

**“నిన్ను పొగిడే ప్రతి ఒక్కరినీ నీ స్నేహితుడిగా, దూషించే ప్రతి ఒక్కరినీ నీ శత్రువుగా భావించడం నీ కన్ను నువ్వే పొడుసుకున్నట్లు. పొగిడిన ప్రతివాడిని నమ్మి మోసపోవడం ఎంత తప్పో, తిట్టిన ప్రతివాడిని శత్రువు అనుకోవడం కూడా అంతే తప్పు”. అది స్నేహితులైనా, బంధువులైనా. నిజానిజాలు అందరికీ తెలుసు కానీ ఎవరికి ఏదైతే నాకేంటి? అనే నిరక్ష్యం వల్లే తనకు తానే తవ్వుకుంటున్న గొయ్యి.**

# నమ్మకం

మన చాపకిందకు నీరు వస్తే గాని చెమ్మను గుర్తుపట్టం.. అన్నట్లుగా ఏదైనా మనదాకా వస్తే గాని మనం మేల్కోలేం. అందుకేనేమో పడవ మునగకముందే ఒడ్డు చేరుకోవాలనే నానుడి పుట్టింది.

ఒక్కోసారి ఎవరిని నమ్మాలి, ఎవరిని నమ్మకూడదు అనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతుంది. ఇన్ని సందేహాలతో మనుషులు బతుకుతున్న పరిస్థితులు చూస్తుంటే అసలు మనిషన్నవాడు ఉన్నాడా.. అనే సందేహం కలగక మానదు. నమ్మి మోసపోయినప్పుడు మనిషి పడే బాధ వర్ణనాతీతం. మరి మనిషి నమ్మకం లేకుండా ఎలా బతకగలడు? నమ్మకం అనివార్యం. నమ్మకం ప్రతిసారీ ఆనందాన్ని ఇస్తుంది. నమ్మకం విచ్ఛిన్నమైనప్పుడు, అది నిరాశను కలిగిస్తుంది.

ఎవరిని నమ్మాలి? ఎవరిని నమ్మకూడదు? ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానం దొరకదు కానీ అనుభవించిన తర్వాత సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. సమాజంలో విశ్వాసులు ఉన్నారు. నమ్మి చెడిపోయిన వారూ ఉన్నారు. నమ్మి ప్రాణాలు కోల్పోయినవారు కూడా ఉన్నారు. అలాంటి వారిలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన జమైకా పాప్ సింగర్ బాబ్ మార్లే ఒకరు. చిన్న వయసులోనే తన పాటలతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన పాటల యోధుడు. ఒకప్పుడు మైఖేల్ జాక్సన్‌కు అభిమానులు ఎంతమంది ఉండేవారో అంతకంటే ఎక్కువ అభిమానులను సంపాదించిన గొప్ప గాయకుడు.

అలాంటి బాబ్ మార్లేకు బిల్ ఆక్స్లీ అనే అభిమాని పరిచయం అయ్యాడు. మార్లే అంటే వీరాభిమానం ఒక్క మాటలో చెప్పాలంటే పిచ్చి. పరిచయం ఏర్పడిన తర్వాత, మార్లేతో ఉండటానికి తన ఇంట్లోనే ఉంటానని చెప్పాడు. మార్లే తనపై చూపిన అభిమానాన్ని కాదనలేక చివరకు సరే అన్నాడు.

బాబ్ మార్లే, బిల్ ఆక్స్లీ కొన్ని రోజుల్లోనే విడదీయరాని స్నేహితులు అయ్యారు. అనుకోకుండా ఓ రోజు మార్లేకి కేన్సర్ ఉందని డాక్టర్ చెప్పారు. అది విన్న బాబ్ స్నేహితుడు బిల్ తట్టుకోలేకపోయాడు. పలు ఆసుపత్రులను సందర్శించారు. పక్కనే ఉన్న బిల్ ఆక్స్లీ వేదనకు గురయ్యాడు. చిరుతిళ్లు, భోజనం మానేసి తన సేవలు చేస్తున్నాడు. కానీ కేన్సర్ మాత్రం తగ్గలేదు. సార్, బ్రిటన్ వెళ్దాం, అక్కడ మంచి డాక్టర్లు ఉన్నారని నాకు తెలుసు, అన్నాడు. అక్కడికి వెళ్లి ట్రీట్‌మెంట్ తీసుకున్న తగ్గలేదు. నా దేశం అమెరికా వెళ్దాం అన్నాడు అక్కడికి వెళ్లి ట్రీట్మెంట్ తీసుకున్నా తగ్గలేదు



అయినా.. ప్రయోజనం లేకపోయింది. కేన్సర్ ముదిరిపోయింది. బాబ్ చావుబతుకుల్లో ఉన్నాడు.

అప్పుడు బాబ్ మార్లే బిల్ ఆక్స్లీని పిలిచాడు. నీలాంటి స్నేహితుడు దొరకడం నా అదృష్టం అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు, దండం పెట్టి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఇటు బిల్ కూడా ఏడ్చేశాడు. నా ఆరాధ్యుడు చనిపోతున్నాడని బోరుమన్నాడు. అలా.. బిల్ చేతుల్లోనే బాబ్ మార్లే ప్రాణాలు వదిలాడు.

ఇంతకీ.. బాబ్‌కి కేన్సర్ ఎలా వచ్చిందంటే? ఒకరోజు షూస్ వేసుకుంటుండగా కుడికాలికి ఏదో సూది లాంటిది గుచ్చుకుంది. అది కనిపించనంత పరిమాణంలో ఉంది. అది కేన్సర్ కారక రసాయనాలతో పూత పూయబడింది. ఆ షూస్ ఎవరివో కావు.. బిల్ బహుమతిగా ఇచ్చాడు!

అంతకుముందు, అతను బాబ్ మార్లే ఇంటిపై తుపాకులతో దాడి చేసి అతని భార్య, కార్మికులను చంపిన ఒక సమూహానికి నాయకుడు. మార్లే బుల్లెట్ గాయంతో బతికి బయట పడ్డాడు. ఆయన్ని చంపాలనే ఆలోచనతో బిల్ కొంతకాలం తర్వాత అభిమానిగా పరిచయం ఏర్పరచుకొని బాబ్ ఇంట్లో చేరి మెల్లగా పని పూర్తి చేశాడు. బాబ్ పక్కనే ఉంటూ అన్ని ఆసుపత్రుల్లో వైద్యం అందకుండా చూసుకున్నాడు.

దీన్నిబట్టి మీకు అర్థమయ్యే ఉంటుంది కదూ! నమ్మకం తేనె పూసిన కత్తి లాంటిది. అందుకే తియ్యని మాటలెప్పుడు చేదు సంఘటనలకు దారితీస్తాయి. అలా అని ఎవ్వరిని నమ్మకుండా మనుగడ సాధించలేం.

నమ్మకం లేకుండా ఏదైనా చేయడం అసాధ్యం. నమ్మకం రకరకాలుగా వివిధ కోణాలలో ఉంటుంది. ఎవరూ పూర్తిగా విశ్వాసం లేకుండా ఉండలేరు. అసలు విషయానికి వస్తే మనిషి నమ్మేవాటిని నమ్మటం లేదు నమ్మకూడనిది నమ్ముతున్నాడు. మనిషి అనునిత్యం అనుమానంతో బతుకుతున్నాడు.



# అధిక ఫలితమిచ్చే పిరమిడ్ ధ్యానం

పంతంగి శ్రీనివాస రావు

**"ధ్యానానికి" ఏ మార్గం అయినా ఒకటే దారి. మనస్సుకు ఎంతో సాంత్వన చేకూరే మార్గం. అది రవిశంకర్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ కావొచ్చు. పిరమిడ్ ధ్యానాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసిన సుభాష్ పత్రీజీ కావొచ్చు.**

పిరమిడ్ ధ్యానం మానవునికి ఎంతో "వైబ్రేషన్"ను కలుగచేస్తుంది. లోపల భాగంలో టైల్స్ కింద పరిచే క్రిస్టల్స్ ద్వారా ధ్యాన సంపన్నత పెరుగుతుంది. పిరమిడ్ నిర్మాణం నిపుణులచే జరుగుతుంది. వారు ఒక కోణం ప్రకారం పిరమిడ్ నిర్మాణాన్ని చేపడతారు. పిరమిడ్‌ను ఇంటి మీద నిర్మించుకుంటే, స్వగృహంలో ఏవైనా వాస్తు దోషాలు గనుక వుంటే అవి నిర్మూలించబడతాయని ప్రగాఢ విశ్వాసం. అందుకే ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది పిరమిడ్ల నిర్మాణం జరిగింది.

నేలపైగానీ, కుర్చీలో గానీ, సోఫాలో గానీ అనువుగా కూర్చొని, కళ్ళు మూసుకుని, రెండు అరచేతులను జాయింట్ చేసి, శ్వాస మీద ధ్యాస వుంచి చేసేదే ధ్యానం. దీనిని "అనాపాన సతి" ధ్యానంగా పేర్కొంటారు.

ఈ ధ్యానం అనంతరం ఎంతో ప్రశాంతత కలుగుతుంది. ఆ రోజంతా ఎంతో ఉల్లాసం, ఉత్సాహం కలిగి మనసంతా తేలికగా అవుతుంది. ఇది ధ్యానపరుల అనుభవం.

పత్రీజీ ఈ ధ్యాన పద్ధతిని దశాబ్దాల తరబడి, విదేశాల్లో సైతం అభిలాష కలిగిన వారిని అమితంగా ప్రభావితం చేశారు. పిరమిడ్ ధ్యానం వలన కలిగే ప్రయోజనం అది అనుభవించిన వారికే తెలుస్తుంది.

అందుకే, పత్రీజీ కడ్తాల్‌లో ప్రపంచంలో రెండవ అతి పెద్ద పిరమిడ్ నిర్మాణం చేసారు. కడ్తాల్‌లోని పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రతి సంవత్సరం చివరి నాలుగైదు రోజులు లక్షలాది మంది పాల్గొని ఇక్కడి ధ్యాన కేంద్రంలో సామూహిక ధ్యానం చేస్తారు.

## మహా పిరమిడ్, కడ్తాల్

రంగారెడ్డి జిల్లాలో మహేశ్వర మహా పిరమిడ్, కైలాసపురి, అన్మాస్‌పల్లి, కడ్తాల్‌లో బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ మార్గదర్శకత్వంలో 2006లో రూపొందించబడిన ఒక నమోదిత నాన్ మత కల్ట్ లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ. ఇది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. అయితే, ఈ సంస్థ ఆధ్యాత్మిక శాస్త్ర వ్యాప్తినే కాకుండా, శాకాహార ప్రాముఖ్యత కూడా వ్యాప్తి చేస్తోంది.



ఈ మహేశ్వర మహా పిరమిడ్ ప్రత్యేకమైన కాస్మిక్ డిజైన్‌లో భాగంగా నిర్మించబడింది. దీని కొలతలు 180" x 180" (32,400 sq.ft.) ఎత్తు 113.60". ఇది ప్రసిద్ధ గిజా పిరమిడ్ పరిణామంలో 1/20వ వంతుతో పోల్చబడింది. ట్రూ నార్త్‌కు సంపూర్ణంగా సమలేఖనం చేయబడింది. ఈ పిరమిడ్‌ను ప్రధానంగా గ్రానైట్, స్టీల్, లైమ్ స్టోన్‌తో నిర్మించారు.

ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ధ్యాన పిరమిడ్. పిరమిడ్ లోపల ఒకేసారి ఐదు వేల మంది ధ్యానం చేయవచ్చు. దీని లోపల ధ్యానం చేసే వ్యక్తులకు, చుట్టు పక్కల దూర ప్రాంతాలకు శక్తిని అందిస్తుంది, స్వస్థత కలుగచేస్తుంది. అందుకే ఈ ప్రాంతాన్ని "శక్తిస్థల్" అని కూడా పిలుస్తారు.

ప్రసిద్ధ దక్కన్ పీఠభూమి బండరాళ్లతో 6000 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ చుట్టూ వున్న కైలాసపురి రహస్యమైన ఎర్త్ ఎనర్జీ లైన్లతో వున్న ఒక పవిత్రమైన ప్రదేశం ఇది. ధ్యానం చేయడానికి, మన లోపలికి వెళ్లి ఆనందాన్ని అనుభవించడానికి ఇది చాలా సరైన ప్రదేశం.

సుభాష్ పత్రి 11, నవంబర్, 1947న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బోధన్‌లో జన్మించారు. 1974లో సైన్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ అయిన ఈయన 1992 వరకు బహుళజాతి ఎరువుల కంపెనీలో పనిచేసారు. ఉద్యోగానికి రాజీనామా చేసి, మానవాళికి ఆధ్యాత్మిక సేవ చేశారు. అప్పటి నుంచి పత్రీజీ 24 జూలై, 2022న చివరి శ్వాస వరకు ప్రతి వ్యక్తికి జ్ఞానోదయం చేసారు.

వ్యక్తిగత శక్తిని పెంపొందింప చేసుకోడానికి ధ్యానం అత్యుత్తమ మార్గం. ధ్యానం ముఖ్యంగా అను పాన సతితో ప్రారంభం అవుతుంది. సాధారణ అభ్యాసంతో ప్రారంభించి ఎవరైనా ప్రతి ఒక్కరూ ప్రావీణ్యం పొందవచ్చు. శారీరక ఆరోగ్యం, మనశ్శాంతి, సరైన బుద్ధిని సాధిస్తుంది. విశ్వం నుండి తీసుకోబడిన శక్తి నిల్వలు, పవిత్ర కోణాలు, అమరికలతో పిరమిడ్ నిర్మాణాలు జరిగాయి. ఇవి ధైర్యం, సంరక్షణ లక్షణాలను కలిగి ఉంటాయి. పిరమిడ్ లోపల ధ్యానం చేస్తే మూడు రెట్లు ఎక్కువ శక్తిని కలిగిస్తుంది. ■



చిట్యాల రవీందర్

# గత దశాబ్దంలో ప్రకృతి విపత్తులు

**ప్రకృతి పరిరక్షణ అనేది మన సమాజంలో ఒక ముఖ్యమైన అంతం. ఇది పర్యావరణాన్ని కాపాడేందుకు, సహజ వనరులను సక్రమంగా ఉపయోగించేందుకు, జీవ వైవిధ్యాన్ని సురక్షించేందుకు చేయబడే చర్యల సమాహారం, పర్యావరణంలో మార్పులు అనేక కారణాల వల్ల జరుగుతాయి, వీటిలో మానవ కార్యకలాపాలు ప్రధానమైనవి.**

ప్రకృతిని పరిరక్షించడం అనేది కేవలం పర్యావరణ అనుకూలతకు మాత్రమే కాదు, అది మన ఆరోగ్యం, ఆర్థిక స్థితి, భవిష్యత్తు తరాలకు కూడ ముఖ్యమని భావించాలి. గత పదేళ్లలో ప్రపంచం మొత్తం మీద ప్రకృతి విపత్తులు తీవ్రతరం అయ్యాయి. వరదలు, తుఫానులు, భూకంపాలు, కరువుల వంటి విపత్తులు మానవాళికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఈ విపత్తులకు కారణాలు, ప్రభావాలు, భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యల గురించి అధ్యయనం చేయడం అత్యంత అవసరం.

### ప్రకృతి విపత్తుల రకాలు, కారణాలు

**వరదలు:** అధిక వర్షపాతం, మంచు కరుగుదల, సముద్ర మట్టాలు పెరగడం వల్ల వరదలు సంభవిస్తాయి. వాతావరణ మార్పులు, అడవుల నరికివేత వల్ల వరదల తీవ్రత పెరుగుతుంది.

**తుఫానులు:** వేడి, తేమపూరిత గాలి ద్రవ్యరాశి తిరుగుతూ వుండడం వల్ల తుఫానులు ఏర్పడతాయి. వాతావరణ మార్పుల వల్ల తుఫానుల సంఖ్య, తీవ్రత పెరుగుతుంది.

**భూకంపాలు:** భూమి లోపలి పొరలలోని రాళ్ళలో అకస్మాత్తుగా జరిగే కదలికల వల్ల భూకంపాలు సంభవిస్తాయి. టెక్టోనిక్ పలకల కదలికలు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు భూకంపాలకు ప్రధాన కారణాలు.

**కరువులు:** అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం వల్ల కరువులు ఏర్పడతాయి. వాతావరణ మార్పులు, అడవుల నరికివేత వల్ల కరువుల తీవ్రత పెరుగుతుంది.

### ప్రకృతి విపత్తుల ప్రభావాలు

**ప్రాణ నష్టం:** ప్రకృతి విపత్తుల వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

**ఆస్తుల నష్టం:** ఇళ్లు, వ్యవసాయ భూములు, మౌలిక సదుపాయాలు నాశనమవుతున్నాయి.

**ఆర్థిక నష్టం:** ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.

**పర్యావరణ క్షీణత:** భూమి, నీరు, గాలి కాలుష్యం పెరుగుతుంది.

**సామాజిక ప్రభావాలు:** పెద్ద ఎత్తున స్థానభ్రంశాలు, ఆహార కొరత, వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.

### భవిష్యత్తులో తీసుకోవలసిన చర్యలు

**వాతావరణ మార్పులను నిరోధించడం:** కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాలను ప్రోత్సహించడం, అడవులను పెంపొందించడం.

**ప్రమాద నిర్వహణ:** ప్రకృతి విపత్తులను ముందుగా అంచనా వేసి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టడం.

**భవన నిర్మాణ ప్రమాణాలు:** భూకంపాలు, తుఫానులను తట్టుకునేలా భవనాలను నిర్మించడం.

**ప్రజలకు అవగాహన కల్పించడం:** ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా ప్రవర్తించాలో ప్రజలకు తెలియజేయడం.

**అంతర్జాతీయ సహకారం:** ప్రకృతి విపత్తుల బాధితులకు సహాయం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో సహకారం పెంచడం.

గత పదేళ్లలో ప్రపంచంలో అనేక ప్రధాన విపత్తులు సంభవించాయి. ఇవి సహజసిద్ధమైన ప్రకృతి విపత్తులుగా, మానవసృష్టి కారణంగా సంభవించిన విపత్తులుగా వర్గీకరించవచ్చు. ఈ విపత్తులు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, భౌగోళిక, ఆర్థిక ప్రభావాలను కలిగించాయి. కొన్ని ముఖ్యమైన విపత్తులు, వాటి వివరాలు:

### 1. భూకంపాలు

**తుర్కియే (టర్కీ), సిరియా భూకంపం (2023):** 7.8 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఇది 50,000కి పైగా ప్రాణ నష్టానికి, లక్షల మందికి అవస్థలకు దారితీసింది.

**నేపాల్ భూకంపం (2015):** 7.8 తీవ్రతతో వచ్చిన ఈ భూకంపంలో 9,000 మందికి పైగా మరణించారు. పశుపతినాథుని ఆలయం వంటి చారిత్రాత్మక కట్టడాలు ధ్వంసమయ్యాయి.

### 2. తుఫానులు

**సైక్లోన్ ఇదై (మొజాంబిక్, 2019):** ఇది 1,000 మందికి పైగా మరణాలకు, అపార ఆస్తి నష్టానికి కారణమైంది.

**యాస తుఫాను (భారతదేశం, 2021):** ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో భారీగా నష్టం జరిగింది.



## 3. వాతావరణ మార్పు కారణంగా వరదలు

చైనా హెనాన్ వరదలు (2021): భారీ వర్షాల కారణంగా హెనాన్ ప్రావిన్స్‌లో అనేక నగరాలు నీట మునిగాయి, 300 మందికి పైగా మరణించారు.

**పాకిస్తాన్ వరదలు (2022):** దేశం మొత్తం 30 నీట మునిగింది, 1,700 మందికి పైగా మరణించారు.

## 4. అగ్నిపర్వత విస్ఫోటనలు

లాసాఫ్రే వల్కానో (సెంట్రల్ అమెరికా, 2021): వేలాది మందిని నివాసాలు విడిచిపెట్టేలా చేసింది.

**మౌంట్ సెమెరూ విస్ఫోటనం (ఇండోనేసియా, 2021):**

ఈ అగ్ని పర్వతం విస్ఫోటనం వల్ల అనేక గ్రామాలను నాశనం చేసింది. ఈ విపత్తులో 51 మంది ప్రాణాలు కోల్పోయారు, అలాగే వందలాది మంది తీవ్రంగా కాలిన గాయాలకు గురయ్యారు. ఈ అపాయం కారణంగా 10,000 కంటే ఎక్కువ మంది నివాసితులను అక్కడి నుంచి తరలించాల్సి వచ్చింది. సుమారు మూడు వేల ఇళ్లను, అందులో కూడా సుంబెర్వులుహ్ గ్రామంలోని వారిని ప్రమాదకర ప్రాంతం నుండి మార్చడం జరిగింది.



## 5. మానవ సృష్టి కారణంగా జరిగిన విపత్తులు

**లెబనాన్ బీరుట్ పేలుడు (2020):** అమెనియం నైట్రేట్ పేలుడు కారణంగా 200 మందికి పైగా మరణాలు, నగరంలో అపార నష్టం. కోవిడ్19 మహమ్మారి (2019-2023): ఈ మహమ్మారి వల్ల, ప్రపంచంలో 70 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

**అఫ్గానిస్థాన్ శరణార్థి సంక్షోభం (2021):** తాలిబాన్ ఆక్రమణతో మానవతా విపత్తు తీవ్రత పెరిగింది.

## 6. అగ్నిప్రమాదాలు

**ఆస్ట్రేలియా అడవి అగ్నిప్రమాదం (20192020):** కోటి హెక్టార్లకు పైగా అడవి నాశనమైంది. వేలాది జంతువులు ప్రాణాలు కోల్పోయాయి.

**అమెరికా కాలిఫోర్నియా అగ్నిప్రమాదాలు:** ప్రతీ సంవత్సరం జరిగిన ఈ అగ్నిప్రమాదాలు అపారమైన ఆస్తి నష్టానికి దారితీస్తున్నాయి.

## 7. వైద్య, ఆహార సంక్షోభాలు

**సూడాన్ ఆహార సంక్షోభం (2023):** యుద్ధ పరిస్థితుల కారణంగా లక్షలాది మంది ఆహారానికి నోచుకోలేని పరిస్థితి.

**యెమెన్ యుద్ధ మూలకాల ఆకలి (2015-2023):** ప్రపంచ ఆరోగ్య సంస్థ దీన్ని "ప్రపంచంలోనే అధిక ఆకలి సంక్షోభం"గా పేర్కొంది. ఈ విపత్తులు పునరావృతం కాకుండా, పరిష్కార మార్గాలను కనుగొనడం మానవత కోసం అత్యంత కీలకం. సాధారణంగా, విపత్తుల పరిష్కారానికి నివారణ, సిద్ధత, ప్రతిస్పందన, పునరుద్ధరణ అనే నాలుగు దశల్లో చర్యలు అవసరం:

**1. నివారణ: ప్రమాద ప్రదేశాల గుర్తింపు.** సహజ వనరుల వినియోగంలో జాగ్రత్తలు. పారిశ్రామిక ప్రమాణాలను అమలు చేయడం.

**2. సిద్ధత:** ప్రజలకు అవగాహన కల్పించడం. విపత్తు నిర్వహణ పథకాలు రూపొందించడం. నిపుణుల శిక్షణతో సహాయక బృందాల ఏర్పాటు.

**3. ప్రతిస్పందన:** ప్రాథమిక సహాయం (ఆహారం, వైద్యం). ప్రమాదం నుండి ప్రజలను తరలించడం. సమాచార వ్యవస్థను మెరుగుపరచడం.

**4. పునరుద్ధరణ:** పునర్నిర్మాణం, తగిన నష్ట పరిహారం.

## అందాయి



**దేవీ స్తోత్ర దీపిక**
సేకరణ: వి.ఎస్. రాఘవాచారి
ప్రచురణ: కళాదీపిక
తిరుపతి

**కొత్త కథలు-6**
(52 మంది రచయితల కథా సంకలనం)
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్

**తెలంగాణ వెలమ వీరుడు**
'బల్మూరి కొండల రాయుడు'
రచయిత: ఎస్.ఆర్.పృథ్వి
ప్రతులకు: శ్రీమతి పి.ఉషారాణి
104-6-140, ఎమ్.జి.స్ట్రీట్
రామకృష్ణ నగర్,
రాజమండ్రి-533 101

**శ్రీ నందమూరి తారకరామ శతకము**
కవి: పాణ్యం దత్తశర్మ
ప్రతులకు: పాణ్యం దత్తశర్మ,
5-4-481/1
ప్లాట్ 20, రోడ్ నం.1
ఆంధ్రకేసరినగర్, వనస్థలిపురం
హైదరాబాద్-70

**త్రిలింగములు**
(శ్రీశైలం, కాళేశ్వరం, దాక్షారామం)
రచయిత: కె.వెంకట రమణమూర్తి
ప్రతులకు: గ్లోబల్ న్యూస్
బి2,ఎఫ్12, రామరాజ నగర్,
సుచిత్రా సెంటర్
సుచిత్రా జంక్షన్ పోస్ట్
సికింద్రాబాద్-67

**శ్రీ లక్ష్మీ నరసింహం**
(భక్తి గజళ్లు)
రచయిత: ద్వావరి నరేందర్‌రెడ్డి
ప్రతులకు: ద్వావరి నరేందర్ రెడ్డి
5-5-27/1
ధన్‌గర్‌గల్లీ, తాండూర్
వికారాబాద్ జిల్లా-501141

**ఏడుకోలల బాయి**
రచయిత: ఏనుగు నరసింహారెడ్డి
ప్రతులకు: పాలపిట్ట బుక్స్
16-11-20/6/1/1, సలీం నగర్,
మలక్‌పేట్, హైదరాబాద్.

కొన్ని పండుగలను కొందరే ఘనంగా చేసుకుంటారు. ఆ రోజున సంబరం కొందరికి మాత్రమే మితమవుతుంది. కానీ కుల మతాలకు అతీతంగా దేశమంతటా అంబ రాన్నంటే సంబరాలతో పండగే స్వాతంత్ర్య దినోత్సవం. అమరవీరుల త్యాగాలను మరొక్కసారి గుర్తు చేసుకుంటూ ముచ్చటైన మూడు రంగుల మిఠాయిలతో నోరు తీపి చేసుకుందాం..

# మువ్వన్నెల వంటలు

## కొబ్బరి లడ్డూలు



**కావలసినవి:** కొబ్బరి తురుము ఒకటిన్నర కప్పు, కండెన్స్‌డ్ మిల్క్‌పావుకప్పు, యాలకుల పొడి “వుటీస్పూన్, పాలురెండు టేబుల్ స్పూన్లు.

**తయారీ:** పావు కప్పు కొబ్బరి తురుమును పక్కన పెట్టుకోవాలి. మిగిలిన కొబ్బరి తురుము, కండెన్స్ ఎల్క్, యాలకుల పొడిని మందపాటి గిన్నెలో వేసి వేడి చేయాలి. తక్కువ మంట మీద కలుపుతూ ఐదు నిమిషాలు ఉడికించాలి. పాలు పోసి మరికాసేపు ఉంచిన తర్వాత చల్లా ర్చాలి. ఈ మిశ్రమనుమూడు సమాన భాగాలు చేయాలి. ఒక భాగంలో ఆరెంజ్, మరో భాగంలో పచ్చ రంగు గ్రీన్ కలర్ వేసి బాగా కలపాలి. చల్లారిన తర్వాత మూడు రంగుల లడ్డులను చుట్టుకోవాలి. ప్లేటు లో మొందుగా ఆరెంజ్, తర్వాత తెలుపు, చివరగా పచ్చరంగు లడ్డూలను అమర్చాలి. మూడు రంగుల లడ్డూలు చూడముచ్చటగా భలే ఉంటాయి.

## బర్ఫీ



**కావలసినవి:** వేపుడు సెనగలు-రెండు కప్పులు, పంచదార కప్పు, బాదం, జీడి పప్పు, పిస్తా పలుకులు-పది చొప్పున, యాలకుల పొడి-చిటికెడు, నెయ్యి-నాలుగు టేబుల్ స్పూన్లు, మీగడ-పావుకప్పు, చిక్కటిపాలు-అరకప్పు, ఆరెంజ్‌ఫుడ్ కలర్, నరగీన్‌ఫుడ్ కలర్-టీ స్పూన్ చొప్పున.

**తయారీ:** వేపుడు సెనగలను పొట్టు తీసుకుని పక్కన పెట్టుకోవాలి. పంచదార, బాదం, జీడిపప్పు పలుకులను మిక్సీ జార్‌లో వేసి పొడి చేసుకోవాలి. తర్వాత సెనగలు వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఈ రెండింటిని వెడల్పాటి గిన్నెలో వేసి, నెయ్యి, మీగడ జతచేసి బాగా కలపాలి. మీగడ బదులు మిల్క్‌పౌడర్ కూడా వేసుకోవచ్చు. కొంచెం కొంచెంగా పాలు పోస్తూ పిండిని ముద్దలా చేయాలి. దీన్ని మూడు భాగాలు చేసుకోవలి. ఒకదాంట్లో ఆరెంజ్ ఫుడ్ కలర్, మరో దాంట్లో గ్రీన్ ఫుడ్‌కలర్ వేసి బాగా కలపాలి. ప్లేటుకు నెయ్యిరాసి జీడిపప్పు, బాదం, పిస్తా పలుకులు వేసుకోవాలి. ముందుగా ఆరెంజ్ రంగులో ఉన్న ముందు వేసి ప్లేటునిండా పరచాలి. తర్వాత తెల్లని ముద్దను, చివరగా పచ్చ రంగు ఉన్న ముద్దను వేసి సమానంగా పరచాలి. గంటపాటు కదపకుండా పక్కన పెట్టేయాలి. తర్వాత చాకుతో నలుచదరంగా ముక్కలు చేసుకోవాలి. రంగుల ముచ్చటైన బర్ఫీ రెడీ.

## ఇడ్లీలు

**కావలసినవి:** ఉప్మా రవ్వ-రెండు కప్పులు, పెరుగుముప్పావు కప్పు, నీళ్ల అరకప్పు, ఉప్పు తగినంత, తురిమిన క్యారెట్, తురిమిన పాలకూర కట్ట ఒకటి చొప్పున, **తయారీ:** వెడల్పాటి గిన్నెలో ఉప్మారవ్వ, పెరుగు, ఉప్పు వేసి బాగా కలిపి అరగంటపాటు నానబెట్టాలి ఈలోగా రెండు మందపాటి గిన్నెల్లో నీళ్ల వేడి చేసి క్యారెట్, పాలకూర తురుము వేసి ఉడికించాలి. వీటిని మెత్తగా మిక్సీ పట్టాలి. ఇప్పుడు నానబెట్టిన రవ్వను మూడు సమాన భాగాలు చేయాలి. ఒక భాగంలో క్యారెట్ పేస్టు, మరోదాంట్లో పాలకూర పేస్టు వేయాలి. ఇప్పుడు చిటికెడు ఉప్పువేసి బాగా కలపాలి. ఇడ్లీ స్టాండులోని రేకులకు నూనె రాసి.. మూడు రంగుల ఇడ్లీలు వేసి.. పది నిమిషాల పాటు ఉడికిం చాలి. ఐదు నిమిషాల పాటు మూత తీయకుండా ఉంటే ఆవిరికి బాగా ఉడుతుంది. అలాగే ఒకే ఇడ్లీలో మూడు రంగులూ వచ్చేలా కూడా వేసు కోవచ్చు. వీటిని కొబ్బరి లేదా టొమాటో చట్నీతో తింటే బాగుంటాయి.



## పులావ్

**కావలసినవి:** నానబెట్టి, నీళ్ల వాడిన బాస్మతీ బియ్యంకప్పు (ఆరెంజ్ రైస్ కోసం), నెయ్యి రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర పావు టీస్పూన్, అల్లంపేస్టు టీస్పూన్, టొమాటో, కాశ్మీరీచిల్లీ ప్యూరీ పావుకప్పు, కారం అరటీస్పూన్ చొప్పున, ఉప్పు అన్నం తగినంత. **తెల్ల అన్నం కోసం:** నెయ్యిలో జీలకర్ర, అల్లంవెల్లుల్లి పేస్టు వేసి అన్నం కలిపి పెట్టుకోవాలి. **పచ్చఅన్నం కోసం:** నెయ్యి రెండు టేబుల్ స్పూన్లు, జీలకర్ర పావుటీస్పూన్, అల్లం పేస్టు టీస్పూన్, పచ్చిమిర్చి పేస్టుటీస్పూన్, పాల కూరపూరీఅరకప్పు, ఉప్పు-సరిపడ,

**తయారీ:** కడాయిలో నెయ్యి వేసి వేడిచేసి జీలకర్ర వేయాలి. అవి చిటపటలాడుతుండగా బియ్యం, అల్లం పేస్టు, రెడ్‌చిల్లీ పేస్టు, కారం వేసి బాగా కలపాలి. తర్వాత టొమాటో ప్యూరీ, ఉప్పు, కప్పు నీళ్ల పోసి మూతపెట్టి ఉడికించాలి. మరో కడాయిలో నెయ్యి వేడిచేసి జీలకర్ర వేసి చిటపటలాడుతూ పసుపు, బియ్యం, గ్రీన్ చిల్లీ,అల్లం పేస్టు, ఉప్పు వేసి కలపాలి.అరకప్పు నీళ్ల పోసి మరిగించి.. పాలకూర ప్యూరీ కలిపి మూతపెట్టి ఉడికించాలి. ప్లేటులో కాషాయ, తెలుపు, పచ్చరంగు పులావును వరుసగా అమరిస్తే మూడు రంగుల పులావ్ సిద్ధం.



ఆనంద 'మైత్రేయ'మ్

# ఔషధాల సుగంధం 'ఇంగువ'

ఇంగువను ఏ వంటకంలో వేసినా మన ఆరోగ్యానికి చాలా మంచి చేస్తుంది. దీనిని 16వ శతాబ్దంలో మొఘలులు భారతీయ వంటలలో వేసేవారు. అఫ్ఘనిస్తాన్, కాబూల్ ప్రాంతాలు ఈ మొక్కలకు ప్రసిద్ధి. కాంథాహార్, ఆఫ్ఘనిస్తాన్, పర్షియా, ఇరాన్ వంటి దేశాలు దీనిని విశేష స్థాయిలో ఉత్పత్తి చేస్తాయి. మన దేశం విషయానికి వస్తే కాశ్మీర్ ప్రాంతంలో ఇంగువ వృక్షాలు ఎక్కువగా పెరుగుతాయి.

భారతదేశపు సాంప్రదాయపు వంటకాల్లో తప్పక దర్శనమిస్తుంది ఇంగువ. ఇంగువకు భారతీయ వంటకాలలో ఒక ప్రత్యేకమైన స్థానం. ఇది కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. ఈ మొక్క జిగురును ఎండబెడితే కూరల్లో వాడుకునే ఇంగువ అవుతుంది. గులాబీ, ఎరుపు రంగులో ఇది దొరుకుతుంది.

శరీరంలో వాపుని తగ్గించే యాంటీ ఇన్ఫ్లమేటరీగా పనిచేస్తుంది. పేగుల్లో గ్యాస్, పురుగులు, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, జీర్ణ సంబంధ సమస్యలను నివారిస్తుంది. మలబద్ధకానికి అద్భుత ఔషధంగా పనిచేస్తుంది. తలనొప్పులు తగ్గిస్తుంది. ఆస్తమా, పొడిదగ్గు, జాతీ పట్టియడం. ఛాతీలో ఫ్లమ్ చేరడం ఇంకా ఊపిరితిత్తుల సమస్యలకు ఇంగువ మంచిమందు. ఇది శ్వాస సమస్యలను తగ్గిస్తుంది. ఇంగువని తేనె, అల్లంలతో కలిపి వాడుకోవాలి. ఇంగువలో సల్ఫర్ యోగికాలు ఉంటాయి కనుక గాఢమైన వాసన వస్తుంటుంది. దీని లోని గాఢత ఉల్లిపాయ వాసనను మించి ఉంటుంది. దీనిని ఆహార పదార్థాల తయారికి వాడుతుంటారు.

ఇంగువను ఆయుర్వేదంలో ఔషధంగా వాడతారు. ఇంగువను నేరుగా కాకుండా శుద్ధిచేసి వాడుకుంటే దానిలోని ఉగ్రత్వం తగ్గుతుంది. ఇనుప మూకుడులో నెయ్యి వేసి నిప్పుల మీద వేడి చేయాలి. తరువాత దీనిలో ఇంగువను వేసి దోరగా వేయించాలి. చల్లారిన తరువాత ఔషధ కల్పనకు ఉపయో గించాలి. హింగ్వాష్టక, హింగుత్రిగుణ తైలం వంటి ఔషదాలు ఇంగువ ప్రధాన ద్రవ్యంగా తయారవుతాయి. ఇంగువను సేకరించే విధానం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇంగువచెట్టు చాలా పొడవుగా పెరుగుతుంది. దీనికి క్యారెట్ ఆకారాన్ని పోలిన పేర్లు ఉంటాయి. వేరు పైభాగంలో కత్తితో గాటుపెట్టి వదిలేస్తే నెమ్మదిగా గట్టిపడి పసుపుపచ్చని రంగు జిగురుగా మారుతుంది. దీనినే ఇంగువ అంటారు. ఇలా సేకరించిన దానిని మట్టి మూకుడులోకి తీసుకొని తోలు సంచిలో ప్యాకేసి మార్కెట్లోకి తరలిస్తారు.

ఇంగువ చాలా ఖరీదైనది కనుక సాధారణంగా కల్తీ కలుపుతుంటారు. తుమ్మజిగురు, బంగాళాదుంప ముక్కలు, ఇంగువ పట్ట కషాయంతో కలిపి



ముద్దచేసి ఇంగువగా చెలామణి చేస్తుంటారు కనుక జాగ్రత్త పడాలి. అసలు సిసలైన ఇంగువను నీళ్లలో వేస్తే పూర్తిగా కరుగుతుంది. ఇంగువ కలిపిన నీళ్లన్నీ పాల మాదిరిగా తెల్లగా తయారవుతాయి. ఇంగువకు అగ్గిపుల్లతో గీసి మండిస్తే పూర్తిగా మండిపోతుంది. బ్రిటీష్ హెర్బల్ ఫార్మకోపియా, ప్రపంచ ఆరోగ్యసంస్థ విడుదల చేసిన మోనోగ్రాఫ్ ఫర్ హెర్బల్ మెడిసినల్ ప్లాంట్స్ వంటివి ఇంగువ ఔషధోపయోగాలను ప్రచురించాయి. దీర్ఘకాలపు బ్రాంకైటిస్, ఉబ్బసం, కోరింత దగ్గు, గొంతు బొంగురు, హిస్టీరియా, ఫ్లాస్టులెంట్ కోలిక్, మూర్ఛలు, ఆంత్రక్రిమి, డిస్పెప్సియా, క్రానిక్ గ్యాస్ట్రైటిస్, ఇరిటబుల్ కోలాన్ తదితర వ్యాధుల్లో ఇంగువ ఉపయోగపడుతుంది. ఇంగువను వాడకూడని సందర్భాలు సైతం ఉన్నాయి. శరీరాంతర్గత రక్తస్రావాలు, గర్భధారణ సమయంలో వాడకూడదు స్తన్యపాన సమయంలో తల్లి వాడకూడదు. యాంటి కోగులెంట్స్, థ్రాంబోలైటిక్స్ వాడుతున్నప్పుడు ఇంగువను వాడకూడదు, రక్తస్రావ వ్యాధుల్లో వైద్య సలహా లేకుండా వాడకూడదు.

ఇంగువను పురాతన కాలం నుండి అజీర్తికి ఇంటివైద్యంగా ఉపయోగిస్తున్నారు, అందువల్లనే దీనిని అలవాటుగా భారతీయ వంటకాలలో ప్రతి రోజు ఉపయోగిస్తుంటారు. దీనిలోని కడుపు మంటను తగ్గించే గుణం, యాంటి ఆక్సిడెంట్ లక్షణాలు, చికాకు పెట్టి కడుపు, పేగులో వాయువు, పేగు పురుగులు, అపాన వాయువు, చికాకుపెట్టి పేగు వ్యాధి (ఐ బి ఎస్) మొదలైన అజీర్తి లక్షణాలను తగ్గించడంలో సహాయం చేస్తుంది. ఒక అరకప్పు నీటిలో చిన్న చిన్న కొన్ని ఇంగువ ముక్కలను కరగించి తీసుకొంటే అజీర్తి, ఋతుసమస్య నుండి వెంటనే ఉపశమనం కల్గుతుంది. వంటకాల్లో విరివిగా ఉపయోగించే ఇంగువ బియ్యంలో పురుగులు చేరకుండా కాపాడుతుంది. దీనికి కారణం ఇంగువ వెదజల్లే ఘాటైన వాసనే, దీన్ని కొద్దిగా తీసుకొని బియ్యంలో కలిపితే సరిపోతుంది. దీని నుంచి వెలువడే ఘాటైన వాసన వల్ల బియ్యంలో పురుగులతో పాటు, తేమ వల్ల పెరిగే బ్యాక్టీరియాను సైతం సంహరిస్తుంది.

ఇంగువ వాసన గిట్టనివారు, ఇంగువని వంటల్లో వాడని తెలుగువారు చాలా తక్కువగా ఉంటారు. ఎందుకంటే తెలుగు వంటకాలలో మన కూరలు, పచ్చళ్ళు, పప్పులు, పులుసులు, దారులలో తప్పనిసరిగా వాడేది, పాత్ర మూత తీయగానే గుప్పుమని సువాసనలు వెదజల్లేది మన ఇంగువ సుమా! ఇంగువకి అంత ఘాటైన సువాసన ఉంటుందని అది మన తెలుగువారి వంటలకి కలికితురాయి అని వేరే చెప్పక్కర్లేదు. ✦

# పలుకే బంగారమాయెనా?

సింగిల్ పేజీ కథ

సింగంపల్లి శేష సాయికుమార్

“ఎవరెన్ని చెప్పినా వినకూడదు ఈసారి నా ప్రయత్నం ఆపను” తనలో తను అనుకుంది. నీళ్ల పాదాలను తాకుతున్నా ఆమె మనసు ఏమాత్రం చల్లబడడం లేదు. ఉన్నట్టుండి వెనుక నుండి ఎవరో చేయి పట్టుకున్నారు. వెనకకు తిరిగి “ఊహా, నువ్వా? ఇక్కడ ఏం చేస్తున్నావు?” అంది సౌధామిని. “నా సంగతి సరే, నీ విషయం చెప్పు. ఎందుకు అంత ఆవేశంగా నడుస్తున్నావు? ఎంతసేపటి నుండి నీ వెనకాల పరిగెత్తుకుంటూ వస్తున్నానో తెలుసా?” అంది ఊహ.

“అలా పక్కన కూర్చొని మాట్లాడుకుందాం” అంది సౌధామిని. ఇద్దరు అసలు విషయంలోకి వచ్చేశారు. “ఎలా ఉంది పెళ్లయ్యాక నీ జీవితం?” అంది ఊహ. మొహంపై అప్రయత్నమైన చిరునవ్వు మాత్రం ఉంది సౌధామినికి.

“ఏమైనా మారాడా? లేదా? ఇంకెన్నాళ్లు ఇలా నీ పోరాటం? నా కాళ్లపై నేను నిలబడతాను” అంటావు. అతనేమో “తెచ్చి పెడతాను” అంటాడు. అతను చేసింది లేదు. నేను చూసింది లేదు. “అలాంటిదేమీ లేదు మా ఆయన చాలా మంచివాడు” అంది సౌధామిని మెల్లగా. ఇద్దరూ తలోకదారి వెళ్ళిపోయారు.

వేణు ఇంకా పెళ్లి కానివానిలా ప్రవర్తిస్తున్నాడు. అమ్మా నాన్నల తదనంతరం అతని పరిస్థితి? సౌధామినిని ఇచ్చి పెళ్లి చేసి దాదాపు మూడేళ్లు పూర్తి కావస్తోంది. రివ్వున తిరిగే కాలచక్రంలో ఒక్కసారిగా అన్ని అతనికి ఎదురొచ్చాయి. నాన్న చనిపోయాడు, అమ్మ అనారోగ్యంతో మంచాన పడింది. ఇల్లు గడవాలంటే తప్పకుండా పనిచేసే తీరాల్సిన సమయం వచ్చింది. “ఆడది ఉద్యోగం చేయడం తప్పా?” అంది సౌధామిని.

“తప్పు కాదు కానీ నాకు అది ఇష్టం లేదు” అన్నాడు.

...........

ఒక పది రోజుల నుండి ఇంట్లోకి కావాల్సిన సామాన్లు ఏమీ అడగడం లేదు. అది లేదు ఇది లేదు అన్న కొరత కనబడడం లేదు. కానీ సౌధామిని మాత్రం ఇంటి గడప దాటడం లేదు. బయట ఎక్కడ పని చేయకుండా ఇల్లు ఎలా నడుపుతుందో అర్థం కాలేదు వేణుకి. ఆమెను ఎలా అడగాలో మాటలు రాలేదు. కనీసం ఏమని అడగాలో అర్థం కావడం లేదు. ఇంతలో చేతికి కమ్మటి కాఫీ కప్పు అందించింది సౌధామిని. కాఫీ పొగల్లో నుండి వస్తున్న సువాసన అతని నోట మాట రానీయకుండా ఆస్వాదింపచేస్తోంది.



“ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు?” అంది ఆమె .

“ఇంతకీ ఏం జరుగుతోంది?” అన్నాడు అతను సూటిగా ప్రశ్నించలేక. “ఏదో జరుగుతోందని మాత్రం అర్థం అయింది ఇన్నాళ్లకు” అంది ఆమె కాస్త నర్మగర్భంగా.

“కాస్త కుదురుగా ఉండి ఇంట్లో ఏం జరుగుతుందో గమనిస్తే మీకే అర్థమవుతుంది” అంది ఆమె.

నేనేమీ చేయలేదు నిన్ను ఏమీ చేయనివ్వలేదు అన్నాడు కాస్త బాధగా. ఏదైతేనేం అతను నన్ను ఇల్లు దాటి బయటకు వెళ్ళొద్దని అన్నది నా మంచి కోసమే కదా అనుకుంది సౌధామిని. నాకు చిన్నప్పటి నుండి మోటివేషన్ క్లాసులు వినడం అలవాటు. నేను కూడా పెద్దయ్యాక అలా మంచి వక్తను కావాలని కోరుకునేదాన్ని. స్కూల్లో, కాలేజీలో ఎక్కడైనా సరే సభ ఉంది అంటే చాలు అక్కడ కచ్చితంగా నన్ను పిలిచి నా చేత దానికి అనుగుణంగా మాట్లాడించేవాళ్లు. పెళ్లయినప్పటి నుంచి అవన్నీ మానేశాను. కానీ నాకు ఇటీవలే ఒక మంచి ఆలోచన వచ్చింది. సోషల్ మీడియాలో నా మోటివేషన్ స్పీచ్‌లు పెడితే ఎలా ఉంటుందా అని. నా ఫోన్లో ఒక మంచి ప్రసంగం అప్లోడ్ చేశాను. అది రెండు రోజుల్లోనే వేల మంది చూశారు. అందులో నుండి ఒక కంపెనీ వారు నన్ను ఫోన్లో కలిశారు. నా స్పీచ్‌లు ఎక్కడ ఎప్పుడు అనేది వాళ్ళే మాట్లాడుతామని, నేను కేవలం వెళ్లి చెప్పి వస్తే చాలని అందుకు మంచి రెమ్యూనరేషన్ కూడా ఇస్తామన్నారు. మన ఇంటి పరిస్థితి అంత బాగోలేని సమయంలో నాకు అది మంచిదే అనిపించింది. నన్ను బయట ఉద్యోగం చేయొద్దన్నారు కదా అదే విషయం వాళ్లకు చెప్పా. వాళ్ళు నన్ను ఎలాగైనా బయట ప్రపంచానికి పరిచయం చేస్తే నాతో పాటు వారికి మంచి ఆదాయం అనుకున్నారు. అందులో పని చేసే ఒక మేనేజర్ నన్ను ఇంటిదగ్గర వీడియోస్ లైవ్‌లో చేయమని సలహా ఇచ్చారు. వారు ఒక మీటింగ్ కుదురుస్తారు. అందులో నేను ఇంట్లో ఉండే మాట్లాడతాను అందుకు నాకు పారితోషికం ఇస్తారు. ఇప్పటికి దాదాపు 50 పూర్తి చేశాను. ఇంకా వరుసగా ఉన్నవి 20 అంది ఆమె తన కప్పు కాఫీలో ఒక గుటకను ఆస్వాదిస్తూ.

“అంటే నేను ఇంట్లో నువ్వు చెప్పే మాట వినను కానీ బయట ప్రపంచం నీ మాటలు వినడానికి ఎదురు చూస్తుందన్నమాట అన్నాడు కాస్త తల దించుకుంటూ. అవునా, కాదా మీరే చెప్పాలి వేణుగారు” అంది కాస్త వెటకారంగా.

“నేను నిన్ను కాపాడేవానిలాగా నా చాదస్తాలతో ఎక్కడికి వెళ్ళొద్దన్నాను. అలాగని నేను సక్రమంగా ఒక పని ఎక్కడా స్థిరంగా చేయలేకపోయాను. నిన్ను సంసారంలో ఇప్పటివరకు అన్ని ఇబ్బందులే పెట్టాను. కానీ నువ్వు అవన్నీ పట్టించుకుని నన్ను అసహ్యించుకోకుండా వేరే మార్గం వెతుక్కుని మరి సంసారాన్ని నెట్టుకొచ్చావు అన్నాడు తన చేయి పట్టుకుంటూ .

ఇంకా ముఖం అటువైపునే ఉంది సౌధామినికి.

“పలుకే బంగారమాయెనా?” అన్న రామదాసు సంకీర్తన వినబడింది ఫోన్ రింగ్ టోన్ రూపంలో.

కథ

# వ్యాపార వారసుడు

**ప్రశాంత్** తన ముగ్గురు కుమారులకు వ్యాపారం అప్పజెప్పాలని భావించాడు. వారిలో వ్యాపార లౌక్యం ఎంతవరకు ఉందోనని పరీక్షించాలనుకున్నాడు. ప్రశాంత్ వద్ద అయిదు తరాల నుండి సంక్రమించిన అతి విలువైన వస్తువులు ఉన్నాయి.

ఒకరోజు తన ముగ్గురు కుమారుల్ని పిలిచి ఆ వస్తువులను వాళ్లకు చూపించాడు.



“కుమారులారా! ఇవి మన వంశానికి అయిదు తరాలుగా సంక్రమించిన ప్రాచీన వస్తువులు. వీటిలో పురాతన నాణేలు, గడియారాలు ఉన్నాయి. మీకు నచ్చిన వాటిని తీసుకుని వెళ్లి అధిక ధరలకు అమ్మండి” అని తండ్రి కుమారులను కోరాడు.

“ఇంత పాత వస్తువులను ఎవరు కొంటారు నాన్నా? పైగా వీటికి అధిక ధర ఎలా వస్తుంది?” అంటూ మొదటి కుమారుడు అక్కడి నుండి వెళ్లిపోయాడు.

రెండవ కుమారుడు కూడా పెద్దవాడి బాటలోనే నడుస్తూ- “ఈ వస్తువులు ఎందుకూ పనికిరావు” అని చెప్పి వెళ్లిపోయాడు.

మూడవ కుమారుడు అన్వేష్ మాత్రం పాత నాణేలు, గడియారాలను తీసుకున్నాడు.

“నాన్నగారూ! వీటిని అమ్మడానికి నాకు కొంత సమయం ఇవ్వండి. పాత నాణేలు, గడియారాలను అధిక ధరలకు అమ్మే ప్రయత్నం చేస్తాను” అని చెప్పి వాటిని తీసుకుని పెద్ద నగరాలకు బయలుదేరాడు.

కొంత కాలం తరువాత చిన్న కుమారుడు అన్వేష్ పెద్ద మొత్తంలో ధరతో తిరిగి వచ్చి తండ్రిని కలిశాడు.

“నాన్నగారూ! మీరు కోరుకున్నట్లే మీరిచ్చిన వస్తువులను అధిక ధరకు అమ్మి సొమ్ము చేశాను” అని చెప్పాడు.

“వీటిని అధిక ధరలకు ఎలా అమ్మగలిగావు అన్వేష్” అని తండ్రి ప్రశాంత్ ప్రశ్నించాడు.

“వీటిని తీసుకుని ముందుగా పాత సామానులవారి వద్దకు వెళ్లాను. వారు వీటి విలువను వందల్లోనే కట్టారు. ఆ తరువాత చరిత్రకారుల వద్దకు వెళ్లాను. వారు వీటి ధరను వేలల్లో చెల్లించడానికి అంగీకరించారు. చివరిగా ఈ ప్రాచీన వస్తువులను తీసుకుని పురావస్తు శాఖలో అనుభవజ్ఞుల వద్దకు వెళ్లాను. వారు వీటి విలువను అంచనా వేసి లక్షల్లో చెల్లించారు’ అని చెప్పాడు మూడవ కుమారుడు అన్వేష్.

అంతలో ఒక వ్యక్తి అన్వేష్ అమ్మిన వస్తువులను తెచ్చి ప్రశాంత్ ముందు ఉంచాడు.

వాటిని చూసి అన్వేష్ ఆశ్చర్యపోయాడు.

“నాయనా అన్వేష్! మన పాత వస్తువులను అమ్ముకోవలసిన అవసరం నాకు లేదు. అందుకే నువ్వు అమ్మిన చోటు నుండి డబ్బు చెల్లించి తిరిగి తెప్పించాను. నేను మీ ముగ్గుర్ని పరీక్షించాను. అందులో నువ్వు నెగ్గావు. ఇకపై నువ్వు నా వ్యాపార వారసుడివి. పెద్దవారిద్దరినీ వేరే రంగాలలో స్థిరపడేలా చూస్తాను” అని చెప్పాడు ప్రశాంత్.


**- షేక్ అబ్దుల్ హకీం జాని,** తెనాలి



వార్త ఆదివారం

## బాలగేయం

### సరిహద్దులు



పిల్లల్లారా!
రారండి..
మన దేశ
ఎల్లలు చెప్పండి
తూర్పు పడమర
ఉత్తర దక్షిణ
ఏమున్నాయో చెప్పండి.

తూర్పు వైపు
బంగాళా ఖాతం
దక్షిణానికి
హిందూ సముద్రం
పడమరకేమో
అరేబియా
ఉత్తరానికి
హిమాలయాలు

ఎల్లలు ఉన్నది
భారతదేశం
సుసంపన్నమైనది
మన దేశం
నాలుగు దిక్కులు
చెప్పాను
భారతదేశం
నా మాతృదేశం.

-పెందోట వెంకటేశ్వర్లు

## హలో ఫ్రెండ్...



చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు



- సి.సరోజ, తిరుపతి

**ప్రశ్న: ఇండియా గేటు ఎవరు, ఎప్పుడు, ఎందుకు కట్టారు?**

**జవాబు:** ఇండియా గేట్ కేవలం ఒక కట్టడం మాత్రమే కాదు. మన సైనికుల త్యాగానికి గుర్తు. అందుకే దానిని ఆల్ ఇండియా వార్ మెమోరియల్‌గా పిలుచుకుంటారు. అంటే అఖిల భారత యుద్ధ స్మారక చిహ్నం అని. ఇది న్యూఢిల్లీలోని రాజ్‌పథ్‌లో ఉన్నది.

– ఒకటో ప్రపంచ యుద్ధం, ఆఫ్ఘన్ యుద్ధాల్లో ప్రాణాలు అర్పించిన 90,000 మంది భారతీయ సైనికుల తాగ్యానికి గుర్తుగా బ్రిటిష్ ప్రభుత్వం కట్టిన స్మారక చిహ్నమే ఇండియా గేట్.

– దీనికి 1921లో ఫిబ్రవరి 10న శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణం పూర్తి కావడానికి పదేళ్ల పట్టింది.

– ఇండియా గేట్ ఎత్తు 42 మీటర్లు. దీని పైన మధ్యలో గిన్నెలాగా ఉంటుంది. వార్షికోత్సవాల సందర్భంగా నూనె పోసి వెలిగించడానికి దీనిని కట్టారు. ఇండియా గేట్ పై భాగంలో ఇంగ్లీష్ అక్షరాలతో ఇలా చెక్కి ఉంటుంది.

To the dead of the Indian Armies who fell honoured in France and flanders mesopotamia and Persia East Africa Gallipoli and else where in the near and the far east and in sacred memory also of those whose names are recorded and who fell in India or the North-East frontier and during the Third Afgan War.

– ద్వారం ఆకారంలో ఉండే ఇండియా గేట్ కింద అమర్ జవాన్ జ్యోతి ఉంది. దీనిని 1971లో ఏర్పాటు చేశారు. ఒక సైనికుడి సమాధి మీద– తలకి పెట్టుకునే హెల్మెట్ తొడిగిన తుపాకీ ఉంటుంది. దీనికి నాలుగు వైపులా ఎప్పుడూ దీపాలు వెలుగుతూనే ఉంటాయి.





# ఘనమైనది భారత రాజ్యాంగం

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి

తెలిసీ తెలియక చేసిన పాపాలను త్రివేణి సంగమంలో కడిగేసుకొని, రానున్న రోజుల్లో ఎంచుకున్న ఉన్నత లక్ష్యాలను ఛేదిస్తూ గణతంత్ర భారతమాతకు సుస్థిరాభివృద్ధి సుగంధ మాలలు వేయాలని దేశ ప్రజలు తీర్మానించుకుంటున్న వేళ దేశ ప్రజలు ఘనంగా 76వ గణతంత్ర ఉత్సవాలను జరుపుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు. మన దేశాన్ని వికసిత్ భారత్‌గా ప్రపంచ దేశాల ముందు నిలపడానికి కృషి చేస్తున్న శుభ గడియలివి. 15 ఆగస్టు 1947 నుంచి 26 జనవరి 1950 వరకు దేశాన్ని డొమినియన్ ఆఫ్ ఇండియా లేదా యూనియన్ ఆఫ్ ఇండియాగా పిలువగా-రాజ్యాంగం ప్రకారం ఇండియాతో పాటు భారత్ అనే పేరుతో ప్రేమగా పిలవడం జరుగుతున్నది.

రాజ్యాంగ రచన, ఆమోదం, అమలు, స్వాతంత్రం పొందిన తర్వాత డా॥ బిఆర్ అంబేద్కర్ నాయకత్వంలో దాదాపు మూడు సంవత్సరాల తర్వాత పరమ పవిత్ర రాజ్యాంగాన్ని 4 నవంబర్, 1949న జాతీయ అసెంబ్లీకి సమర్పించగా, 26 నవంబర్, 1949లో నాటి రాజ్యాంగ సభ ఆమోదించగా, అమలులోకి తెచ్చుకున్న పవిత్ర సందర్భం 26 జనవరి 1950 అని మనకు తెలుసు. అంతే కాకుండా 26 జనవరి 1930న భారత జాతీయ కాంగ్రెస్ ప్రకటించిన పూర్ణ స్వరాజ్ దినంకు గుర్తుగా మనం ప్రతి సం॥ 26 జనవరిన గణతంత్ర దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. భారత రాజ్యాంగ కల్పించిన మౌలిక సూత్రాలు సమ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం లాంటి అంశాలను గుర్తు చేసుకుంటూ ఈ ఉత్సవాలను అత్యంత దేశభక్తితో నిర్వహించుకుంటున్నాం. భారత రాజ్యాంగ రచన కమిటీకి చైర్మన్‌గా డా॥ బిఆర్ అంబేద్కర్ సేవలందించగా సభ్యులుగా అల్లాడి కృష్ణస్వామి అయ్యంగార్, గోపాలస్వామి అయ్యంగార్, కెఎం మున్షీ, సయ్యద్ మహమ్మద్ షాదుల్లా, బి ఎల్ మిట్టర్/ఎన్ మాధవరావు, టి.టి. కృష్ణమాచారి, ఎం.అనంత శయనం అయ్యంగార్ లాంటి విద్యావంతులు, మేధావులతో పాటు 299 మంది తమ విశిష్ట సేవలు అందించారు.




## సాధించింది పిరికెడు..సాధించాల్సింది దోసెడు

స్వతంత్ర భారతం గత 78 యేండ్లుగా సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ, అధిగమించవలసిన సవాళ్లను ఎదిరించడానికి సిద్ధం అవుతూ, మనం వ్యక్తులుగా ఎదుగుతూ, కుటుంబ సంక్షేమాన్ని సాధిస్తూ, దేశాభివృద్ధికి మన వంతు కర్తవ్యాలను నిర్వహిస్తూ, భవిష్యత్తులో భారతాన్ని అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేరడానికి కంకణబద్ధులం కావలసిన సందర్భం, ఉత్తమ తీర్మానాలు చేసుకోవలసిన వేదికగా 26 జనవరి 2025 వేడుకలు నిలవాలి. దేశవ్యాప్తంగా 76వ గణతంత్ర వేడుకలు జరుపుకోవడానికి సిద్ధం అవుతున్న వేళ భారతాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగం, పేదరికం, అధిక జనాభా, ఆర్థిక సామాజిక లింగ అసమానతలు, అవిద్య యువతలో నైపుణ్యాల కొరత, బాల కార్మిక దురాచారం, మహిళలపై హింస, ప్రజారోగ్యం పడకేయడం, కాలుష్య మేఘాలు కమ్మడం, వాతావరణ ప్రతికూల మార్పుల ప్రభావం, అవినీతి అక్రమాల చెదలు లాంటి సవాళ్లను అధిగమించడానికి ప్రమాణం చేయవలసిన వేదిక మన గణతంత్ర దినోత్సవం.

## భారత గణతంత్ర దినోత్సవం 2025 థీమ్

స్వాతంత్ర్య భారతంలో దేశభక్తి, స్ఫూర్తికి సూచిక మన గణతంత్ర దినోత్సవం. భారత గణతంత్ర దినోత్సవం 2025 థీమ్‌గా "స్వర్ణ భారతం-వారసత్వం, వికాసం" అనే అంశాన్ని తీసుకోవడం విశేషం. దేశవ్యాప్తంగా భారతీయులు జరుపుకునే పండుగల్లో గణతంత్ర దినోత్సవం ఒకటి.

న్యూఢిల్లీ కర్తవ్య పథ్ మైదానంలో నిర్వహించే 2025 గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఈసారి ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షులు ప్రభోవో సుబియాంటో హాజరు కానున్నారు. ఈ రోజున జాతీయ పతాకాన్ని ఎగురవేయడం, జాతీయ గీతాలాపనలు చేయడం, మిఠాయిలు పంచుకోవడం లాంటివి ఊరు వాడలు, విద్యాలయాలు, కార్యాలయాలు, ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు, ఎన్‌జిఓలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున జరుపుకుంటాయి. ప్రధాన ఉత్సవ కార్యక్రమం న్యూఢిల్లీలో ఇండియా గేట్ వద్ద రాష్ట్రపతి జెండా ఎగరేయడంతో ప్రారంభం అవుతుంది. త్రివిధ దళాల భారీ పెరేడ్, రక్షణ రంగంలో శక్తివంతమైన ఆయుధాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అభివృద్ధి ప్రదర్శనలు, స్వాతంత్ర్య సమరం క్షేత్రంలో అమరులైన మహానుభావులకు ఘన నివాళులు, అర్హులకు ప్రతిష్టాత్మక అవార్డుల ప్రదానం.. లాంటి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

మేక్ ఇన్ ఇండియా చొరవలో భాగంగా అవసరమైన మౌలిక వనరుల కల్పన, లాజిస్టిక్ నెట్‌వర్క్ స్థాపన, పాలసీలను రూపొందించి అమలు చేయడం, యువభారతాన్ని నైపుణ్య భారతంగా మార్చడం ద్వారా నిరుద్యోగ భూతాన్ని తరిమేయడం, బహుముఖ అభివృద్ధికి ఆర్థిక వనరులు సమకూర్చడం, అంకుర సంస్థలు/ఇన్నొవేషన్/సృజనలకు పెద్ద పీట వేయడం, పెట్టుబడులకు అవకాశాలు కల్పించడం, ఆధునిక శాస్త్రసాంకేతిక శిక్షణలు, సాంకేతికతలను సామాన్యుడి దరికి చేర్చడం, ఆర్థిక అవరోధాలను అధిగమించడం, యువశక్తిని సక్రమ మార్గంలో పెట్టి దేశాభివృద్ధి వైపు మరల్చడం లాంటి చర్యలు "వికసిత్ భారత్" స్వప్నాలను సాకారం చేయనున్నాయి.

(భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా)

**ఫిజిక్స్ అరుణ్‌కుమార్**

# యుగ పురుషుడు

**1948** జనవరి 30న గాంధీజీ భౌతికంగా తన తనువును వదిలి అస్తమించారు. అయినా నేటికీ ఆధునిక ప్రపంచ పటానికి పాఠ్య పుస్తకమై సత్యప్రకాశంతో, అహింసా వినీలాకాశంలో విశ్వ శాంతి పరిమళాలను వెదజల్లుతూనే వున్నారు. ప్రతి సంవత్సరం జనవరి 30న మన దేశమంతటా అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటూ స్వాతంత్ర్య సంగ్రామంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన మహానుభావులను స్మరించికుంటూ వారందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఈ శతాబ్దపు వివిధ రంగాల్లో ప్రపంచ ప్రముఖులుగా వున్న ఆల్బర్ట్ ఐన్ స్టీన్,ఆంగ్ సాన్ సూకీ, రవీంద్రనాథ్ ఠాగూర్, సివిరామన్, బెర్నార్డ్ షా, మార్టిన్ లూథర్ కింగ్, దలైలామా, నెల్సన్ మండేలా, స్టీవ్ జాబ్స్, కైలాష్ సత్యార్థి, బరాక్ ఒబామా, చార్లీ చాప్లిన్ తదితరులు వంటివారు సైతం గాంధీజీ నుంచి స్ఫూర్తి పొందిన వారే. ఈ శతాబ్దపు అత్యంత ప్రభావశీల వ్యక్తుల్లో ప్రముఖంగా వినిపిస్తూ కనిపించే వ్యక్తిత్వపు హిమగిరి శక్తి పేరు గాంధీజీ. కొన్ని సందర్భాల్లో గౌతమ బుద్ధుడు, శ్రీకృష్ణుడు వంటి వారి బోధనలను ఆచరించి చూపిన కారణజన్ముడు, యుగపురుషుడు గాంధీజీ అని విఖ్యాత ప్రముఖులు పోల్చుతుంటారు. సత్యం, అహింస పునాదులపై విశ్వమానవతా ప్రేమ శిఖరాన్ని తన సందేశంగా, మన దేశపు ముఖచిత్రంగా నిలిపినవారు గాంధీజీ. ఆయన మార్గంలో నడిచి, అందరికీ ఆదర్శంగా నిలిచి ఎంతోమంది నోబెల్ బహుమతులు గెలిచారు.



వ్యవసాయం, వ్యాపారం, వాణిజ్యం, విద్య, వైద్యం, సైన్స్, పర్యావరణం వంటి ఏ రంగాల్లోనైనా ఆయన జీవిత పరిశోధనలే ఇప్పుడు మనం అనుసరిస్తున్న పాఠ్యాంశాలు అయ్యాయి. ప్రేమతో, సామరస్యంతో ద్వేషంపై గెలవొచ్చని, యుద్ధం పేరుతో ఆధిపత్యం మాయలో మనుషుల్ని చంపడం దారుణమని మతోన్మాదం మంచిది కాదని ఏనాడో హెచ్చరించారు గాంధీజీ. ప్రపంచ ఆకలిని తీర్చే అన్నం పెట్టే రైతన్న మన దేశపు ఆత్మగా అభివర్ణించారు. కార్మికులు, సైనికుల త్యాగం గొప్పదన్నారు. కేవలం పాలన మారటమే స్వాతంత్రం కాదని అస్పృశ్యత, అంటరానితనం, అజ్ఞానం, పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, మత విద్వేషాల వంటి మహమ్మారులను మన దేశం నుంచి తరిమేయటమే నిజమైన స్వాతంత్రం అనీ, చరిత్ర వెంట పాదయాత్ర చేసి ప్రజల్లో చైతన్యం నింపారు. ఆయన అస్తమించి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా అవే మహమ్మారులు మన దేశంలో కూడా అప్పుడప్పుడు అక్కడక్కడా కనిపిస్తూనే వున్నాయి.

గ్లోబల్ వార్మింగ్‌తో పర్యావరణాన్ని నాశనం చేస్తున్న నేటి ఆధునిక మానవుని గురించి "ప్రకృతి మన అవసరాలను మాత్రమే తీరుస్తుంది మన కోరికలను కాదని సూచించాడు. పట్టణీకరణ ముసుగులో మన గ్రామాలే ఈ దేశానికి పట్టుగొమ్మలు అన్న విషయాన్ని మరువకూడదన్నారు.

ఆయుర్వేదం, ధ్యానం వంటి ఆరోగ్య విధానాలను తను ఆచరించి నేటి తరానికి ఆదర్శమయ్యారు. మనిషిలో అంతర్లీనంగా దాగి ఉన్న ఆధ్యాత్మిక, నైతిక విలువలను వెలికితీసే విద్య కావాలన్నారు. శాస్త్రీయంగా ఎదుగుతూనే సాంకేతికత చాటున హింసను సృష్టించడం, ప్రకృతిని విధ్వంసం చేసే చర్యలు చేపట్టడం భవిష్యత్ తరాలకు ప్రమాదమన్నారు. నైపుణ్యాలను పెంపొందిస్తూ, జీవనోపాధిని ఇచ్చే విధంగా ఆధునిక విద్య వుండాలని ఆకాంక్షించారు. ఈ దేశ భవిష్యత్తు పార్లమెంటులో కాదు పాఠశాలల్లోనే నిర్మించబడుతుందనే దార్శనికతను గాంధీజీ బలంగా విశ్వసించారు.

తన చేతిలో భగవద్గీత పట్టుకొని తన జీవన సమరాన్ని శోధించిన గాంధీజీ ఆత్మ కథ "The story of My experiments with Truth (సత్య శోధన) పుస్తకం ప్రఖ్యాత గ్రంథం ఎంతో గుర్తింపు పొందింది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో భాషల్లోకి ఈ పుస్తకం అనువాదం చేసారు.

ప్రపంచ ప్రముఖ రచయితలు సైతం గాంధీజీపై ఎన్నో పుస్తకాలు రచించారు. భారతదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలు, ఆయన పేరు మీద నడిచే స్వచ్ఛంధ సంస్థలు, అవార్డులు, విద్యాసంస్థల వంటివి ఎన్నో వున్నాయి. భారత ప్రభుత్వం కూడా అంతర్జాతీయ స్థాయిలో మానవాళిని ప్రభావితం చేసిన ప్రముఖులకు గాంధీ పేరు మీదే గాంధీ శాంతి బహుమతి అందిస్తున్నది.

ప్రపంచ స్థాయిలో విశ్వమానవుడిగా అ'సాధారణ' వ్యక్తిగా విశేష ప్రాచుర్యం పొందిన గాంధీజీని గురించి ప్రస్తుతం కొంతమంది సంకుచితంగా ఆలోచించడం మనం ఆందోళన చెందాల్సిన విషయం. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి మాత్రమే ఆయనను పరిమితం చేసే నాటకీయపు పరిణామాలు ఇకనైనా ఆపాలి. అందరివాడుగా వున్న ఆయనను కొందరివాడుగా చేయడం మానుకోవాలి.

మన జాతి సమగ్రతను కాపాడాలి. గాంధీజీ పుట్టిన దేశం అంటూ ప్రపంచం మనల్ని గౌరవిస్తున్న తీరుతో ప్రతి భారతీయుడి గుండె గర్వపడాలి. ఆయన కలలుగన్న విశ్వశాంతి వికాసానికి మనమంతా సమిధలు కావాలి. విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ "రక్తమాంసాలతో కూడిన గాంధీజీ లాంటి యుగపురుషుడు ఈ భూమిపై నడిచాడంటే భవిష్యత్తు తరాలు నమ్మవు!" అంటూ గాంధీజీకి అందించిన అక్షర నివాళి ఇంకా కొన్ని శతాబ్దాలు గాంధీని(యి)జంను వేలకోట్ల తారల వెలుగై సత్యంతో ప్రకాశించేలా చేస్తాయి.

కథ

కర్లపాలెం హనుమంతరావు

# పరామర్శ

నాంపల్లి కేర్ హాస్పిటల్ ముందు ఆటో ఆగేసరికి సమయం సాయంకాలం ఐదుగంటలు, విజిటర్స్‌తో ఆసుపత్రంతా కోలాహలంగా ఉంది. రిసెప్షన్ కౌంటర్ దగ్గరికెళ్ళి నేనొచ్చిన పని చెప్పాను. వెంట తెచ్చుకొన్న కాగితాలూ చూపించాను. కంప్యూటర్లో సరిచూసుకొని "రూమ్ నెంబర్ టూ నాట్ ఫైవ్ మ్యాడమ్! ఫ్లోరు కార్నర్లో ఉంటుంది. తొందరగా వెళ్ళండి! ఇంకో గంటలో విజిటింగ్ అవర్స్ అయిపోతాయి" అంది రిసెప్షనిష్టు.

లిఫ్ట్ ఎక్కి ఆ ఫ్లోర్ చేరేసరికి ఇంకో పావుగంట. ఆ ఫ్లోర్ ఇన్‌చార్జ్ అనుకొంటా మళ్లీ వివరాలు అడిగే "ఒక టెన్ మినిట్స్ వెయిట్ చేయండి! లోపల డాక్టరుగారున్నారు" అంటూ ఓ కార్నర్ సీటు చూపించింది కూర్చోమన్నట్లు.

వెంట తెచ్చుకొన్న పళ్లబుట్ట పక్కన పెట్టుకొని కూర్చున్నాను. ఆసుపత్రి వాతావరణం నాకంతగా పడదు. మందులూ, రోగులూ, పరామర్శలూ.. ఏమంత ఉల్లాసకరమని కోరుకోవడానికి మరీ దగ్గరవాళ్ళను పరామర్శించాల్సి వస్తే సాధారణంగా ఇళ్ళకే వెళతాను. ఈ సారే ఇలా!

ఇన్‌చార్జ్ నర్సుకి ఖాతాఖానీ కొట్టేవాళ్ళెవరూ దొరకలేదులాగుంది నా పక్కకు వచ్చి కూర్చుంది. ఇద్దరు ఆడవాళ్ళు ఒకచోట. చేరితే కబుర్లకు కొదవేముంది!

రామారావుగారిని చూస్తే నిజంగా చాలా జాలనిపిస్తుంది మ్యాడమ్! ఈ వయసులో రాకూడని కష్టం. నిజంగా దురదృష్టమే! ఎప్పుడు బాగా లేకపోయినా ఇక్కడికే వస్తుంటారు. ఈసారే మరీ బాగా చెడిపోయింది. సగం రోగం అసలు కుటుంబం దూరమైందనే! పోనీలేండి! ఇంత కాలానికి మీరైనా వచ్చారు. చూసి ఎంత సంతోషిస్తారో! మీ అబ్బాయి కూడా వచ్చుంటే బాగుండేది!!

నాకేం సమాధానం చెప్పాలో తోచలేదు. నా సమాధానం కోసం ఆమె ఎదురు చూడలేదు కనక సరిపోయింది!

రూమ్ నుంచి డాక్టరుగారు బైటికి రావడంతో నర్సు వాక్ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. ఇంకో నర్సు వచ్చి నన్ను ఆ రూమ్‌లోకి తీసుకువెళ్ళింది.

గదంతా చల్లగా ఉంది. మందుల వాసన. బెడ్ మీద కళ్ళు మూసుకొని ధ్యానంలో ఉన్నట్లు పడుకోనున్నాడాయన. రోగం మూలకంగా వయసు మరీ మీద పడినట్లుంది. నర్సు ఆయన్ని చేత్తో రెండు మూడు సార్లు తట్టిన తరువాత గాని ఆయన కళ్ళు తెరిచి పడలేదు.

"సార్! ఎవరొచ్చారో చూడండి.. మీకోసం" అంది ఆమె అభిమానంగా.

కళ్లు అటూ ఇటూ తిప్పి చూసాడు. చూపు ఒక చోట నిలబడటంలేదు. దేనికోసమో వెతుకుతున్నట్లున్నాయా చూపులు..

"గుర్తు పట్టినట్లు లేదు. మైండ్ సరిగ్గా ఉండటంలేదు" అని నాతో చిన్నగా అని– "ఇటు.. ఇటువైపు చూడండి రామారావుగారూ! మీ మిసెస్.. కలవరిస్తున్నారుగా మేడమ్ కోసం! తనివితీరా కబుర్లు చెప్పుకోండి" అని నా వంక నవ్వుతో చూసి మళ్లీ లో వాయిస్‌లో "సైట్ కూడా ఎఫెక్టు అయినట్టుంది. సాధ్యమైనంత వరకూ క్లోజ్‌గా కూర్చుని టచ్ చేస్తూ మాట్లాడండి! ఈ డిసీజ్‌కి పేషెంటుకి కావాల్సింది హ్యూమన్ టచ్) భయపడకండి! ఎయిడ్సు అంటువ్యాధి కాదు. మీరు మాట్లాడుకోండి! నా అవసరం అనిపిస్తే పిలవండి వస్తాను. ఇంకో అరగంటదాకా విజిటింగు టైముంది! అని హెచ్చరించి డోర్ లాగి వెళ్ళిపోయింది నర్సు.

గదిలో నేనూ.. ఆయనా! నర్సు మాటలు గుర్తుకొచ్చాయి.


వెంట తెచ్చుకొన్న పండ్లు సైడ్ డెస్కు మీద పెట్టి వెళ్ళి ఆయన మంచానికి దగ్గరగా కుర్చీలాక్కొని కూర్చొన్నాను.

బలహీనమైన గొంతుతో ఆయన అన్నారు "నన్ను క్షమిస్తావా జానకీ! నీకు తీరని ద్రోహం చేసాను. అందుకు ఇప్పుడు అనుభవిస్తున్నాను" ధారాపాతంగా ఆయన కళ్ళవెంట నీళ్లు కారుతున్నాయి.

చాలా జాలీగా అనిపించింది. ఓదార్పుగా ఆయన చేతిని నా చేతిలోకి తీసుకొని అన్నాను "ఇప్పుడవన్నీ ఎందుకు చెప్పండి! నేను వచ్చేసాగా! ఇంక హాయిగా విశ్రాంతి తీసుకోండి!" నా గొంతు నాకే వింతగా అనిపించింది.

"కాదు జానకీ! నన్ను చెప్పనివ్వు.. నాకు తెలుసు! నాకింక అట్టే టైము లేదని. ముందు నిన్ను క్షమాపణ అడగాలి. ఎంత హింసించాను నిన్ను! అయినా ఏ రోజూ నాకు ఒక్కమాట ఎదురు చెప్పేదానివి కాదు.

నేను చెడు తిరిగిన మాట నిజమే! కానీ ఈ ఎయిడ్సు వ్యాధి నువ్వు అనుకున్నట్లుగా రాలేదు.



నువ్వు అపార్థం చేసుకొన్నావు. నన్ను విడిచి వెళ్ళిపోయావు. నాకీ రోగం వచ్చిందన్న బాధకన్నా నన్ను నీవు తప్పుగా అర్థం చేసుకొని వెళ్ళిపోయావన్న బాధే ఎక్కువగా ఉండేది.

ఏమని బదులు చెప్పాలో నాకు తోచలేదు.. "ఈయన్ని మాట్లాడనిస్తే చాలు. మనసులో ఇన్నాళ్లూ గడ్డకట్టుకుపోయిన దుఃఖం ఇట్లానైనా కరిగి బైటికి వచ్చేస్తే మందు ఆ అపరాధ భావన తొలగిపోతుంది" అనుకుని మౌనంగా వింటూ కూర్చున్నాను అందుకే!

"షిర్డీ వెళ్ళాను గుర్తుందా నీకు.. ప్రమోషన్ వచ్చిందని, తిరిగొచ్చేటప్పుడు ఏక్సిడెంటయింది. చాలామంది చనిపోయారు. ప్రాణాలతో బైటపడ్డవాళ్లలో నేనూ ఒకణ్ణి. చాలా రక్తం పోయిందని దగ్గర్లో ఉన్న అదే ఆసుపత్రిలో రక్తం ఎక్కించారు. ఎక్కడ జరిగిందో పొరపాటు. ఎయిడ్స్ తగులుకొంది. బాగా ముదిరిందాకా తెలీలేదు. తెలుసుకొని ఇప్పుడు ప్రయోజనమూ లేదు. విషయం చెప్పుకొనే అవకాశం కూడా ఇవ్వకుండా నువ్వెళ్లిపోయావు. మిగతావాళ్ళ సంగతి వదిలేయ్! నువ్వూ నన్ను అపార్థం చేసుకొన్నావన్నదే నా బాధ. నీ బాధ నేను అర్థం చేసుకోగలను. ఎయిడ్స్ వచ్చిన మొగుడితో ఏ భార్యయినా ఎట్లా కాపురం చేస్తుంది? నువ్వు వెళ్ళిపోవడాన్ని తప్పుపట్టడంలేదు. నా తప్పు ఏమీ లేదని చెప్పుకొనే అవకాశం కూడా ఏమీ ఇవ్వకుండా వెళ్ళావు" ఆయాసంతో ఆయన చెప్పుతున్నారు.

ఆ ధోరణిని ఆపకపోతే ఇంకా ఆయాసపడతారు "ఇప్పుడు తిరిగి వచ్చేసాగా! ఇంకెందుకండీ ఆ పాత విషయాలన్నీ! నేను మిమ్మల్ని తప్పు పట్టివుంటే తిరిగి వచ్చేదాన్నా! మీరు చెప్పాలనుకొన్నది చెప్పారు. గుండెబరువు దించుకొన్నారు. ఇకనైనా ప్రశాంతంగా నిద్రపోండి కాస్సేపు! బాగా అలసిపోయారు" అని లేవబోయాను.

"ఇంకా అక్కడే ఉంటే ఎక్కువ ఇబ్బంది పెట్టినట్టవుతుంది" అనిపించింది. గభాలున నా చేతిని గట్టిగా పటుకొన్నారు. అంతలో తప్పిపోకుండా పిల్లాడు తల్లిచెయ్యి పటుకొన్నట్లు "లేదు జానకీ! నువ్వు వెళ్లొద్దు! నువ్వు నా దగ్గరుంటే నాకు ధైర్యంగా ఉంటుంది. నువ్వు పక్కనుంటే యమధర్మరాజుతోనైనా యుద్ధం చేస్తా" అంటూ వలవలా ఏడ్చేస్తుంటే ఎలా ఓదార్చాలో అర్థంకాలేదు.

"ఇలా బాధపడతారని తెలిస్తే అసలు వచ్చేదాన్నే కాదు. ఇంకా బాధపడుతుంటే ఇప్పుడే వెళ్ళిపోతాను" అన్నాను బెదిరింపు ధోరణితో.

నిజంగానే వెళ్ళిపోతానని అనుకొన్నట్లున్నారు.. కాస్త సర్దుకొన్నారు! "లేదులే కుర్చో... ఇలా నా పక్కన.. నాకు హాయిగా ఉంటుంది. నిద్రపోతే నువు వెళ్లిపోతావని భయంగా కూడా ఉంది" అన్నారు నా రెండు చేతుల్ని తన గుప్పిటమధ్య గట్టిగా బంధించి గుండెలకి అదిమిపెట్టుకొంటూ.

"ఎక్కడికీ పోను. నిశ్చింతగా నిద్రపోండి!" అన్నాను.

నర్సు ఇచ్చిన ఇంజెక్షన్ ఇప్పుడు పనిచేయడం మొదలు పెట్టినట్లుంది. మెల్లిగా మగతలోకి జారుకొన్నారాయన ఐదు నిమిషాల్లో.

నిద్రపోతున్న ఆయన మొహంలో పసిపిల్లవాడు కనిపిస్తున్నాడు. ఎంతసేపు అలా కూర్చుండిపోయానో తెలీదు!

తలుపు చిన్నగా కొట్టి లోపలికొచ్చింది నర్సు. గభాలున మంచం దిగిపోయాను. గుప్పిటలో నుంచి నా చేతులు విడిపించుకోబోతే వీలు కాలేదు. ఆ గుప్పిట గట్టిగా ఉంది! చల్లగా ఉంది! ఆయన చేతినరాలు బిరుసెక్కుతుండటం గమనించాను.

నా అనుమానం నిజమే. అయితే.. నర్సు సాయంతో ఆయన గుప్పిట పట్టు నుంచి నా చేతిని విడిపించుకొన్నాను. చివరిసారిగా ఆయన్నొక్కసారి చూసి బైటికి వచ్చేసాను.

"చాలా కాలం తరువాత ఇవాళ ఆయన మొహంలో ఆనందం చూసాను మేడమ్! ఇంజెక్షన్లు, మందుల ద్వారా మేమివ్వలేని ప్రశాంతత మీరు అందించారు. మెనీ మెనీ థాంక్స్!" అంది ఆయన్ను ట్రీట్ చేస్తున్న డాక్టర్ హాస్పటల్నుంచీ నేను బైటకు వచ్చేటప్పుడు.

"యువర్ కాంప్లిమెంట్స్ గో టు మై హజ్బెండ్ అండ్ టు మేక్ ఏ విష్ ఫౌండేషన్!" అన్నాను.

ఇక్కడికి బైలుదేరేముందు "నా విజిట్ వర్క్అవుట్ అవుతుందా? కాదా?" అని నాకే సందేహంగా ఉండేది.

ఈ రామారావుగారు ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్, భార్యా బిడ్డలతో కలసి షిర్డీ వెళ్ళివస్తుంటే బస్సు యాక్సిడెంటయింది. ఆ ప్రమాదంలో భార్య, బిడ్డ అక్కడికక్కడే చనిపోయారు. ఈయన తలకు బలమయిన గాయమైంది. మతిమరుపు వ్యాధి మొదలయింది. కాలంతో పాటు ముదురుతూ వచ్చింది.

ప్రమాద సమయంలో జరిగిన చికిత్సలోపం వల్ల ఎయిడ్స్ ఉన్న రక్తం ఒంట్లో చేరింది. ఇన్సూరెన్సు ఉన్నందువల్ల డబ్బుకి ఇబ్బందిలేదుగానీ.. లేని భార్యాబిడ్డలని తీసుకురావడం ఎట్లా? చివర చివర్లో ఆయన భార్యను గురించే కలవరిస్తుంటే.. ఆసుపత్రివాళ్ల ద్వారా ఆ

"చాలా కాలం తరువాత ఇవాళ ఆయన మొహంలో ఆనందం చూసాను మేడమ్! ఇంజెక్షన్లు, మందుల ద్వారా మేమివ్వలేని ప్రశాంతత మీరు అందించారు. మెనీ మెనీ థాంక్స్!" అంది ఆయన్ను ట్రీట్ చేస్తున్న డాక్టర్ హాస్పటల్నుంచీ నేను బైటకు వచ్చేటప్పుడు.

వార్త "మేక్ ఏ ఫౌండేషన్" వాళ్లకి చేరింది.

మా వారు ఆ సంస్థలో యాక్టివ్ మెంబరు, ప్రాణాంతకమయిన వ్యాధుల బారినబడ్డ బాలల తీరని చివరి కోరికలను వీలయినంతవరకు తీర్చే ప్రయత్నం చేసే స్వచ్ఛంద సేవా సంస్థ "మేక్ ఎ ఫౌండేషన్". సమస్యల్లా వారి సేవలు నియమ నిబంధనల ప్రకారం బాలలకే పరిమితం.. చివరి రోజుల్లో ఉన్న రామారావు గారి చివరి కోరికను తీర్చాలన్న సదుద్దేశం మా వారికి కలిగింది "మేక్ ఏ విష్ ఫౌండేషన్" వారి స్ఫూర్తితోనే. నన్ను రామారావుగారి భార్య జానకిగా వెళ్ళి పరామర్శించి రమ్మని ప్రోత్సహించింది మా వారే!

బయలుదేరేముందు కాస్త గిల్టీగా అనిపించినా ఇప్పుడు ఒక మంచిపని చేసానన్న సంతృప్తి మిగిలింది. రామారావుగారి మతిమరుపువల్లే నా పరామర్శ విజయవంతమయింది. ✦

# పువ్వు-కొమ్మ

**పువ్వు** తరలిపోయింది
తోటమాలి కర్కశత్వానికి

కొమ్మ కన్నీరు కారుస్తోంది
పువ్వుతో అనుబంధం
విరిగిపోయిందని.

కొమ్మ తనువంతా గాయమై
కుమిలిపోతోంది
పువ్వు కూడా విరహంతో
విలపిస్తోంది

పువ్వు కొమ్మకున్న బంధం తిరిగి
చిగురించాలంటే అంటు కట్టాలి.
కొమ్మ మళ్లీ చిగురు వేయాలి.
పువ్వు మొగ్గ తొడగాలి.

కొమ్మపువ్వు ఆనందం పొందాలి.
మళ్లీ పువ్వు కొమ్మ ఒక్కటిగా
తీగల్లే అల్లుకుపోవాలి.

కొమ్మ కొత్త చిగుళ్లతో
పువ్వు మొగ్గ తొడిగి పువ్వై విరిసి
ప్రేమానుభూతులు అనుభవించాలి!

– నాగముని యం.



ఈ వారం కవిత్వం

# కాలం పండు

**గోడపై** వాలిన
గడియారం
చిలుక
కాలం పండును
కొరుకుతోంది
గుండెలో దాగిన
లబ్..డబ్ లు
కాలం పాదరసాన్ని
వెనక్కి తోస్తున్నాయి
పట్టుదల హస్తంతో
కాలాన్ని పట్టుకోవచ్చు
కొత్త చరిత్రకు
శ్రీకారం చుట్టవచ్చు
ప్రకృతి నీ ఆదర్శమైతే
జీవితం ఆకాశంలో
పాలపుంతలను
ప్రకాశింపజేయవచ్చు.

– డి.కె. చదువులబాబు

# ఈ క్షణమే నీది!

**ఈ** క్షణాన్ని తనివితీరా
ఆస్వాదించు!
మరుక్షణం గురించిన
మరో ఆలోచనని రానివ్వకు!

సమసిపోని సమస్త వేదనల్లోకి
నెట్టేయబడతావు!
ఎందుకయ్యా?

నీకా తిప్పలు!
ఈ క్షణం నీది!
ఇంకెందుకాలస్యం ఆస్వాదించు!

గుప్పెడు మల్లెపూల వాసన
వచ్చినా చాలు
నీ జీవితంలో!

– బాలాజీ పోతుల

# నవతంత్రం!

**పూర్ణ** స్వరాజ్యం
నిండు సూర్యుళ్ళా
ప్రభవించిన దినం.

స్వతంత్ర శక్తికి గణతంత్ర యుక్తి
కలిసిన సర్వసత్తాక చైతన్య దినం.
సామ్యవాదం లౌకిక ధర్మం
స్వర్ణఘంటంతో
నవభారతం లిఖించిన దినం.
రవి అస్తమించని బ్రిటీషుని
సాగనంపి
కోటి సూర్యుళ్ల వెలుగులతో
కొత్త ఉదయానికి తెర తీసిన
భారత రాజ్యాంగ
ఆరంభోత్సవం!

ఎందరో త్యాగధనుల
మేధోతంత్రమే
నేటి గణతంత్రం
సామాన్యుణ్ణి అందలమెక్కించే
అవకాశాలు అడుగడుగునా పుష్పించే
పూలవనంలా దేశం వికసించాలని
కలలు కన్న మహనీయుల
ఆశయాలకు
ఊపిర్లు అందించే ఘన తంత్రం!
కుల మత ప్రాంత చీకట్లు తోలి
నవోదయంలో జవాన్ కిసాన్
సూర్యచంద్రుల్లా వెలిగే నవతంత్రం!.

– భీమవరపు పురుషోత్తమ్



## సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

# 'నీ బాసల్నే నీ బతుకున్నది'

జయసూర్య

"తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విద్యాసంస్థలలో తెలుగు మాధ్యమం లేకపోవడం, మాతృభాషాభిమానులకు, తెలుగుపై నిరంతరం ప్రేమ ఒలకపోసుకుంటున్న తెలుగువారికి చీమ కుట్టినట్టుగా కూడా లేకపోవడం, తమిళనాడులో జీవిస్తూ తెలుగును తల్లిగా ఆరాధిస్తున్న, ఒక తెలుగు సోదరునికి ఆవేదన కలిగించిన సంఘటన అయింది. తెలుగునాట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థలలో తెలుగు మీడియం తీసేసి ఏడాది అవుతున్నా, ఇక్కడి ప్రజలు ఎందుకు స్పందించడం లేదో ఆశ్చర్యంగా ఉందని ఆయన అన్నారు. తెలుగు భాషామాధుర్యాన్ని, తల్లుల పేరుతో విడదీయటం సరికాదన్నారు. తమ కుటుంబం వ్యాపారరీత్యా తమిళనాడులో స్థిరనివాసం ఏర్పరచుకొన్నా, తెలుగువారిగానే జీవిస్తున్నామని, తామంతా ఇంట్లో తెలుగే మాట్లాడుకొంటామని, మాతృభాష తెలుగు అంటే తమకు అమితమైన ప్రేమాభిమానాలున్నాయని అన్నారు. తెలుగుతల్లి విగ్రహాలపై ఆవేదనాపూరిత ఉపన్యాసం చేసిన ఆయన ప్రసంగానంతరం, వేదిక మీద పక్కనున్నవారు, తెలుగు మీడియం తీసేసిన విషయం ఆయనకు చెప్పటంతో, మరోసారి మైక్ అందుకొని 'ఇప్పుడే నాకు విషాదకరమైన మరో విషయం తెలిసింది. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం తీసేసారని... ఇదేమిటి? పిల్లలకు మాతృభాష లేకుంటే ఎలా? ఇదే మా తమిళనాడులో అయితే...' అంటూ ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వం వెంటనే తెలుగు మీడియం పునరుద్ధరించాలి. లేకుంటే ఇక్కడే నేను మరోసారి వచ్చి నిరాహార దీక్ష చేస్తానన్నారు.

తెలుగు మీడియం రద్దు చేస్తూ నాటి ప్రభుత్వం యిచ్చిన జీవోపై రెండు రాష్ట్రాలలోని మాతృభాషాభిమానులైన మేధావులు, రచయితలు, కవులు, పండితులు ఎందుకు స్పందించలేదనే ప్రశ్న ఆయన ద్వారా తల ఎత్తింది. విజయవాడలో నిర్వహించబడిన ప్రపంచ రచయితల మహాసభ వేదిక అది. తమిళనాడుకు చెందిన కృష్ణగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యుడు గోపీనాథ్‌ను తల్లడిల్లచేసిన సంఘటన అది.

గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన జీవో 85ను మాతృభాషా ప్రేమికుడు గుంటుపల్లి శ్రీనివాస్ చేసిన న్యాయపోరాటం కారణంగా రాష్ట్ర హైకోర్టు కొట్టేసింది. అయితే ప్రభుత్వం ఆ తీర్పుపై సహజంగా సుప్రీంకోర్టుకు వెళ్ళింది. అప్పుడు కూడా ప్రభుత్వచర్యను ఖండించినవారు లేరు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్న ఆ అప్పీలును ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకొని తెలుగుమీడియం పునరుద్ధరించాలని సభాముఖంగా జస్టిస్ రమణ పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి అటు తెలుగు, ఇటు ఇంగ్లీషుమీడియమ్‌లు రెండూ ఉండేలా పాతవిధానం కొనసాగించే సత్ఫృషి సఫలమైతేనే తెలుగునాట తెలుగుకు వెలుగు. విజయవాడ ప్రపంచ తెలుగు మహాసభలలో తమిళనేత గోపీనాథ్ ఆవేదనను, రాజమహేంద్రవరం నుంచి వెలువడే వారపత్రిక 'ప్రజాపత్రిక' అధినేత సుదర్శన్ సమగ్రవార్తగా వెలుగులోకి తెచ్చారు. 'నీ బాసల్నే నీ బతుకున్నది' అన్నారు కాళోజీ. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా' అన్నారు రాయప్రోలు. ప్రపంచ తెలుగు మహాసభలలో, వివిధ దేశాలవారు తమ మాతృభాషను ఆ దేశాలు ఏవిధంగా కాపాడుకుంటున్నాయో మనం పట్టించుకోవటం లేదు. తల్లికి తెలుగు వస్తేనే పిల్లలకు వచ్చే అవకాశం వుంది. ఇంట్లో పిల్లలకు తెలుగు నేర్పే ప్రయత్నం అసలు లేదు. ప్రతి ఇంట్లో పిల్లలకు మూడేళ్ళ, రెండేళ్ళ ప్రాయం నుంచే, తెలుగు పద్యాలు, పాటలు, శతకాలు, చిన్నకథలు నేర్పించే రోజులు లేవు. పాఠశాలల్లో విధిగా పిల్లలకు ఇంటిభాషలోనే బోధనకు శ్రీకారం చుట్టాలి. ప్రాథమిక స్థాయిలోనే ఇంటిభాషను తప్పనిసరి చేయాలని జాతీయ పాఠ్య ప్రణాళికా చట్టం-2005 నిర్దేశిస్తోంది. విద్యాహక్కు చట్టం-2009 కూడా మాతృభాషలోనే బోధన చేయాలని సూచిస్తోంది. బడిలో పిల్లలకు తెలుగులో చిన్న కథలు, పాటలు, అమ్మా నాన్నలకు, అన్న, అక్కాచెల్లెళ్లకు, స్నేహితులకు ఉత్తరాలు రాయడం నేర్పాలి. ప్రస్తుతం ఆంగ్లమాధ్యమం, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు అవసరం కాబట్టి ఎంతవరకు ప్రాధాన్యం యివ్వాలో అంతవరకే ఉండాలి. తల్లిభాషను తల్లడిల్లచేస్తున్న ప్రభుత్వ ఉత్తర్వు తక్షణం రద్దుచేసే చర్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టాలి.

ఇక తెలుగుతల్లిని రెండు ముక్కలు చేసి, తెలంగాణతల్లిని విగ్రహరూపంలో సృష్టించుకోవడం అంశంపై కూడా తెలుగు ప్రేమాభిమానిగా గోపీనాథ్ ప్రస్తావించి ఆవేదన వ్యక్తం చేసారు. శంకరంబాడి సుందరాచారి, 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ', తెలుగురాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు, రెండు రాష్ట్రాల అస్తిత్వ ఆవిర్భావ నేపథ్యం ఎదుర్కొనే రాజకీయ పరిస్థితి ఎదుర్కొంటున్నాయి. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి కారణమైన తెలుగు ప్రస్తుతం రెండు రాష్ట్రాలలో అధికార ఆధిపత్యానికి ప్రతీక అయింది. రాజకీయ పార్టీ అయిన తెలుగుదేశం, ఆంధ్రప్రదేశ్ రాజ్యాధికారం చేపట్టగా ప్రస్తుతం మరో తెలుగురాష్ట్రం తెలంగాణాలో కాంగ్రెస్ ఆధిపత్యంలోకి వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం సాధించే దిశలో పోరాట, బలిదానాల, త్యాగచరిత్రలో అంతర్భాగంగా 'తెలంగాణ తల్లి' తెలంగాణ అస్తిత్వ, పునరుజ్జీవన లక్ష్యంతో ఆరాధించబడుతోంది. ఈ విగ్రహ ప్రహసనంతో రాష్ట్ర ప్రాంతీయతకే కాని భాషకు సంబంధంలేదు. అమ్మభాష ఎక్కడైనా ఆరాధ్యనీయంగానే అందరికీ వుంది. ఉమ్మడిరాష్ట్రంగా వున్న 1975 నాటి రోజులలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కాశీపాండ్యన్, తెలుగు భాషాభిమానిగా కలక్టరేట్‌లో తెలుగుతల్లి తొలి విగ్రహం ప్రతిష్ఠింపచేసారు. విగ్రహశిల్పి శంకర్ రూపకల్పన సఫలం చేసారు. దశాబ్దం తర్వాత ఎన్.టి.ఆర్. ఇతర అధినేతలు తెలుగురాష్ట్ర, ఐక్యత, సమగ్రత దృష్టితో అడుగులు వేసారు.



ప్రస్తుత రాజకీయ రంగానికి సంబంధించి వర్తమాన, స్వరూప, స్వభావాల పరిణామాల నేపథ్యానికి మాత్రమే వర్తిస్తాయి. అన్నింటికీ మించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెలుగునాడు కాకపోవడం ఎప్పటికీ చారిత్రక తప్పిదమే. 'నీ బాసలోనే నీ బతుకున్నది' అన్న కాళోజీ మాట అక్షరసత్యం. ✦

ఒక్కొక్క మనిషికీ ఓ ప్రత్యేకత ఉంటుంది. వేర్వేరు చేతి, కాలి వేళ్ళలా వారు వేర్వేరుగా ఉంటారు. కవలలిద్దరు కూడా ఒకేలా ఆలోచించరు. చూడ్డానికి ఒకేలా ఉన్నప్పటికీ వారు ఆలోచించే తీరు వేరుగా ఉంటుంది. ఎవరినో ఒకరిని గురువుగా భావించో లేక గురువుగా చేసుకునో జీవితాన్ని ఏర్పాటు చేసుకోవాలని కొందరంటూ ఉంటారు. చేయి పట్టుకుని రాయడం నేర్పించినట్టే జీవితంలో అనేక పాఠాలు అనుభవాలై మనల్ని నడిపిస్తుంటుంది.

# అనుభవాలే జీవిత పాఠాలు

**యామిజాల జగదీశ్**

ప్రతిఫలించడం అనేది వేరు. అనుసరించడం అనేది వేరు. అనుసరించడం సులభం. మనం చేయవలసినదంతా ఎదుటి వ్యక్తి వాటిని పొల్లు పోకుండా చేసెయ్యడం. ఎదుటి వ్యక్తి చెప్పిన విషయాన్ని అలాగే తిరిగి చెప్పడం. ఈ క్రమంలో తనను తాను కోల్పోతూ ఇతరులపై ఆధారపడటమే జరుగుతుంటుంది.

ప్రతిఫలించడం కఠినం. అది సహజంగా జరిగేది. ప్రయత్నాలు లేకుండా కలిసిరావడం అనేదానికి చాలా కాలం కావలసి ఉంటుంది. అది తన లోపలి నుంచి బయటకు రావాలి. ఒక మనిషి చేస్తున్నట్లుగా చేసేటప్పుడలా తనదైన శైలి ఉండదు. అంతా అవతలి వ్యక్తి మీద ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో ఒక్కొక్కప్పుడు లేని పోని ఆటంకాలు ఎదురవవచ్చు.

కొన్నిసార్లు అలా అనుసరించి చేయడంలో ఇబ్బందులు తలెత్తవచ్చు. సమస్యగా మారొచ్చు. స్వకీయాన్ని కోల్పోవడం జగురుతుంది. ప్రతిఫలించడం అనేది అద్భుతమైనది.

తనకంటూ ఓ శక్తి ఉందని అనుకునేవారు ఏదైనా అనుకునిదాన్ని చేయడానికి పెద్దగా శ్రమపడవచ్చు. తాననుకున్నట్లు చేసుకుంటూ పోవచ్చు. ఎందరు ఏమన్నా మనదైన శైలిలో మనం అనుకున్నది చేసుకుంటూ పోతాం. ఇందులో సమస్యా ఉండదు. మూలం చెడదు. చేసే శక్తీ ఉంటుంది.

అందమైన పరిపూర్ణమైన చందమామను ఒక కొలను ప్రతిబింబిస్తుంది. ఆ ఒక్క కొలనే కాదు. మరిన్ని కొలనులు కూడా చందమామను ప్రతిఫలింపచేస్తాయి. అయితే కొలను నీరు స్పష్టంగా తేటతెల్లంగా ఉండాలి. అప్పుడే చందమామను ఉన్నది ఉన్నట్టుగా చూడవచ్చు. ప్రతిఫలించడానికి అటు చందమామకానీ ఇటు కొలను కానీ ఎలాంటి ప్రయత్నమూ చేయవు. కొలను కొలనుగానే ఉంటుంది. దానిలోని నీళ్ల నీళ్లలాగే ఉంటాయి.

ప్రతిఫలించేటప్పుడు కొలను నీరు ఇంకా అందంగా కాంతివంతంగా కనిపిస్తుంది. ఒక గురువుగారి దగ్గర విద్యార్థిగా ఉన్నతను అచ్చం గురువుగారిలాగా చేసాడు. శిష్యుడిగా ఉన్నతను ప్రతిఫలిస్తాడు. కొంచెం కొంచెంగా గురువు గారి నుంచి అవసరమైనదంతా తనలోకి తీసుకుంటాడు. వాటిని అలాగే ప్రతిఫలింపచేస్తాడు. కాని ఈ క్రమంలో అతను ఆలోచించే శక్తిని కోల్పోతాడు. గురువుగారు ఏం చేస్తే దాన్ని తు.చ. తప్పకుండా చేసేస్తాడు. అక్కడి వరకే అతనికి శక్తి ఉంటుంది.



ఒకరిలా చేసే వ్యక్తి జీవితాన్ని సాగిస్తున్న కాలంలో అతనిని తెలుసుకుంటారు. ప్రతిఫలించే వ్యక్తి జీవితం తర్వాత కూడా గుర్తుండిపోతాడు. అతని గురించి నలుగురూ చెప్పుకుంటారు. ఒకరిని అనుసరించే వ్యక్తి ఆలోచించే జోలికి పోడు. అవతలి వ్యక్తి ఏం చేస్తే దానిని అలానే చేస్తాడు. అంతగా బుర్ర పెట్టి పని చేయాల్సిన అవసరం ఉండదు.

కొలనులో ప్రతిబింబించే చందమామ గర్వపడదు. కారణం, అది తన సొంత ప్రయత్నమేమీ కాదని తెలుసు. నిజమైన ఏ గురువూ తనలాగే ప్రతి శిష్యుడూ చేయాలని అనుకోడు. కారణం, ఆయనే తన గురువుని అనుసరించినట్టు తనకు తెలుసు.

అనగనగా ఓ గురువు ఉన్నారు. ఆయన తననెవరైనా ఏదైనా ప్రశ్న అడుగుతున్నప్పుడు ఆయన తన చూపుడు వేలును పైకెత్తి జవాబు చెప్పడం అలవాటు. ఆయన వద్ద సపర్యలు చేసిన ఒకతను ఏదైనా చెప్పాలనుకుంటే ఆయనలాగా చూపుడు వేలు పైకెత్తి ఆ శిష్యుడు అభిమానంతో చేసేవాడే తప్ప అహంకారంతోనో వెటకారంతోనో చేసింది కాదు.

ఆయనను అనుసరించడాన్ని ఆపినప్పుడు ఆ మనిషి చైతన్యవంతుడయ్యాడు. చివరికి తన శిష్యులను ఉద్దేశించి మాట్లాడేటప్పుడు ఆ గురువు తన నిజాన్ని అంగీకరించాడు. తాను చూపుడు వేలు పైకెత్తే అలవాటు గురువుగారి నుంచి వచ్చిందని అన్నాడు. అలా ఎప్పుడైతే చెప్పారో అప్పుడు అతను చైతన్యవంతుడయ్యాడన్న మాట.

చందమామను చూపించే వేపు చందమామ అయిపోదుగా. అలాగే అద్దం కూడా తనలోకి చూసేవారినెవరినీ అసలు రూపాలుగా మార్చలేదు. కేవలం వారి బింబాన్ని చూపుతుందంతే.

# దక్షిణ నైరుతి వీధి పోటు ఉంటే?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ


డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




(గత వారం తరువాయి...)

నైరుతి ఎంత బాగున్నప్పటికీ, నైరుతి భాగంలోని "దక్షిణ నైరుతి" భాగంలో ఒక వీధి పోటు తగులుతున్నది అనుకోండి. ఆ ఇంటిల్లిపాదికి ఈ దక్షిణ నైరుతి వీధి పోటు వలన ఇక్కట్లు తప్పవు. దక్షిణ నైరుతి వీధి పోటు వలన కలిగే అనర్థాలు ఏమిటంటే- ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు. అవి కూడా మామూలుగా ఉండవు. తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉంటాయి. ఒక్కొక్కసారి ఆక్సిడెంట్స్ కి గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటివి జరగటం వల్ల కూడా హఠాత్తుగా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇంట్లో ఉన్న వాళ్లందరికీ





అనారోగ్య సమస్యలు ఉండకపోవచ్చు. అందరికీ యాక్సిడెంట్స్ జరగకపోవచ్చు. కుటుంబంలో ఎవరికో ఒకరికి జరగొచ్చు. ఇంటిల్లిపాది కూడా వారి వలన డిస్టర్బ్ అయిపోతారు. అంటే ఇంట్లో ఒకరికి తీవ్రమైన అనారోగ్య సమస్య వచ్చినప్పుడు, లేదా యాక్సిడెంట్ జరిగినప్పుడు మిగతా కుటుంబ సభ్యులందరూ కూడా వారి ధనాన్ని, సమయాన్ని కూడా వెచ్చించవలసి వస్తుంది. అలా అందరూ డిస్టర్బ్ అయిపోతూ ఉంటారు. ఈ విధంగా ఒకరి తర్వాత ఒకరికి అనారోగ్య సమస్యలు వస్తూ ఉండటం వలన ఆ కుటుంబంలో తీవ్రమైన అశాంతి నెలకొంటుంది. డబ్బు ఖర్చు అయిపోతూ ఉంటుంది. ఇంటి లోపల నైరుతి బాగుండి అక్కడ మనం డబ్బు దస్కం పెట్టడం వల్ల ధనం నిలకడగా ఉంటుందని చెప్పుకున్నాం. అంతవరకు బాగుంది. నైరుతి దిక్కు ధర్మం నైరుతి అనుకూలంగానే నిర్వర్తిస్తుంది.

కానీ దానికి ప్రతికూల (నెగెటివ్) ఫలితాలు ఇచ్చేటటువంటి "దక్షి ణ నైతిక వీధి పోటు" ఒకటి తోడైనప్పుడు, ఈ ధనమంతా కూడా అనారోగ్య సమస్యల వలన ఖర్చు అయి పోతూ ఉంటుంది. ఇంటి లోపల ఉండే వాస్తు స్వరూప, స్వభావాల కంటే, ఇంటికి బయట నుండి తగిలేటటువంటి వాస్తు స్వరూప, స్వభావాలు చాలా బలమైనవి. ఇంటి లోపల వాస్తు ఎంత బాగున్నప్పటికీ ఇంటి బయట ఉండేటటువంటి వీధి పోట్లు, వెన్నుపోట్లు, ఎత్తు పల్లాలు ఇవన్నీ కూడా చాలా బలంగా పనిచేస్తాయి. అవి కొన్ని సందర్భాలలో చాలా బలంగా అనుకూలంగా ఉంటాయి. మరికొన్ని సందర్భాలలో చాలా బలంగా ప్రతికూలంగా కూడా ఉంటాయి.

ఈ వీధి పోట్లలో దక్షిణ నైరుతి వీధి పోటు అనేది, చాలా బలంగా పనిచేసే ప్రతికూలమైన ప్రభావం కలిగిన స్వభావములు కలిగినది. అందుకని మనం ఎప్పుడైనా ఒక ఇల్లు కొన్నప్పుడు కానీ, కిరాయికి వెళ్తున్నప్పుడు కానీ ఆ ఇంటికి ఇటువంటి దక్షిణ నైరుతి వీధి పోటు ఉంటే దానిని తీసుకోకూడదు.

అందులోకి కిరాయి కూడా వెళ్ళకూడదు. కిరాయికి ఉన్నవాళ్ళు ఖాళీ చేసి వెళ్లిపోతే వాళ్ళకి ఈ వీధి పోటు దోషం ఉండదు. కానీ ఆ ఇంటి సొంతదారు ఎవరైతే ఉంటారో, అతనికి ఈ వీధి పోటు దుష్ఫలితం ఆ ఇంటిని అమ్ముకొని వెళ్ళిపోయేవరకు ఉంటుంది. ఇలాంటి వీధి పోట్లు ఉన్న ఇండ్లను వదిలించుకోవడం కూడా చాలా కష్టం. ఎందుకంటే ఈ రోజుల్లో చాలా మందికి వాస్తు పరిజ్ఞానం ఎంతో కొంత ఉంది.

ఇటువంటి దక్షిణ నైరుతి వీధి పోటు ఉందంటే, ఆ ఇల్లు కొనుక్కోవటానికి కూడా ఎవరూ ముందుకు రారు. ఇంటి యజమానులకు కాలం గడపటం కష్టంగా ఉంటుంది.

ఇలాంటి ఇండ్లలో తప్పనిసరిగా ఉండవలసి వస్తే, ఈ వీధి పోటును బారిన పడకుండా ఏదో విధంగా రక్షణ కల్పించుకోవాలనుకుంటే, దీనికి "ప్రత్యామ్నాయ పద్ధతులు" కొన్ని ఉన్నాయి. ఈ పాటించటం వలన నైరుతి వీధి పోటు సాంద్రత క్రమంగా తగ్గుతుంది. కాలం గడుస్తున్నకొద్దీ నెగటివ్ అంటే ప్రతికూల సాంద్రత తగ్గుతూ తగ్గుతూ ఉంటుంది. తద్వారా కొంత మెరుగైన ఫలితాలు ఉంటాయి.

◆

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్తలో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్ వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................

పుట్టిన తేది : ........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:...........................................

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*

# సుందర మణిహారం దుబాయ్

డా॥ గన్నంరాజు దుర్గాప్రసాద్ రావు




**యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యు.ఎ.యి)లో దుబాయ్ నగరం ఒక అందాల సుందర మణిహారం. ఎత్తైన కట్టడాలు, విశాలమైన మైదానాలు, విలాసవంతమైన షాపింగ్, అందమైన హోర్డింగులు, అల్ట్రా మోడర్న్ ఆర్కిటెక్చర్, లైవ్లీ నైట్ లైఫ్ దృశ్యాలకు ప్రసిద్ధి.**

మొదటగా ఇక్కడ చూసింది గురుద్వారా. గురుద్వారా పక్కనే ఆధ్యాత్మికమైన గురు దర్బార్. అందరు దేవుళ్ళు ఇక్కడే సమావేశం అయినట్లు దేవలోకాన్ని తలపించింది. చూడవలసిన ముఖ్యమైన ప్రదేశాల్లో మిరాకిల్ గార్డెన్, బట్టర్ ఫ్లైగార్డెన్ చాలా సుందర ప్రదేశాలు

## దుబాయ్ మిరాకిల్ గార్డెన్

ఇది ప్రపంచంలోనే అతిపెద్ద పూల తోట. విశాలమైన ప్రాంతంలో విస్తరించి ఉన్న ఈ గార్డెన్ ఒక పూల కళాఖండం. క్లిష్టమైన డిజైన్‌లు, ఉత్కంఠ భరితమైన నమూనాలలో 150 మిలియన్లకు పైగా పుష్పాలను దర్శించవచ్చు.

గుండె ఆకారపు తోరణాల నుండి గొప్ప పూలకోట వరకు గార్డెన్ ప్రతి మూల ఒక దృశ్యమానమైన విందును అందిస్తుంది. ఇందులో వాటర్ ఫాల్స్, ఫౌంటెన్, లైట్ షో క్యాంటీన్లు తదితర సదుపాయాలతో ఒకసారి లోపలికి వెళ్తే ఎన్ని గంటలైనా గడిపేయొచ్చు.

## బటర్ ఫ్లై గార్డెన్

ప్రపంచంలోనే అతిపెద్ద సీతాకోకచిలుకల గార్డెన్ ప్రతి గోపురం అందంగా రెక్కలున్న వేలాది జీవులతో నిండి ఉంది. వివిధ పరిమాణాలు, రంగులలో దాదాపు యాభై రకాల సీతాకోక చిలుకలకు చెందిన 15,000 సీతాకోక చిలుకలు మన చుట్టూ ఎగురుతూ ఉంటాయి.

## బుర్జ్ ఖలీఫా

దుబాయ్‌లోని ఆకాశహర్మ్యం ఇది. 136 ఫ్లోర్లతో నిర్మితమైన ఈ కట్టడం ప్రపంచంలోనే ఎత్తయినది. దీని ఎత్తు 829.8 మీటర్లు. మనం తిలకించడానికి మాత్రం 125 అంతస్తుల వరకు అనుమతిస్తారు. కేవలం 2,3 నిమిషాల్లో చేర్చే లిఫ్టులున్నాయి. పైనుండి దుబాయ్ నగర అందాలను చూడవచ్చు.

## దుబాయ్ మాల్

దుబాయ్‌లోని అతిపెద్ద షాపింగ్ మాల్. ఇది ఇరాన్ మాల్ తర్వాత ప్రపంచంలో రెండవ అతి పెద్ద మాల్ బుర్జ్ ఖలీఫాకు ఆనుకుని ఉన్న డౌన్‌టౌన్ దుబాయ్ కాంప్లెక్స్‌లో భాగం. ఇందులో 1,200 దుకాణాలున్నాయి. ఎంత ముందుకు వెళ్ళినా మాల్ చివరలు తొందరగా కనిపించవు. సందర్శకులతో కిటకిటలాడుతూ అందాలు ఆరబోసినట్లు అడుగడుగునా కొత్త అనుభూతి కలుగుతుంది.

## దుబాయ్ ఫ్రేమ్

దుబాయ్ ఫ్రేమ్ ఒక ఐకానిక్ ల్యాండ్ మార్క్. అబ్బ్రర్వేటరీ మ్యూజియం స్మారక చిహ్నం. ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ఫ్రేమ్ 150 మీటర్ల ఎత్తు, 93 మీటర్ల వెడల్పులో ఉన్న ఈ నిర్మాణం విస్మయం కలిగించింది.

అత్యాధునిక ఎలివేటర్లతో ఫ్రేమ్ పై భాగానికి చేరుకుని, రెండు టవర్లను కలిపే 'గ్లాస్ వాక్ వే'లో నడవడం మరపురాని అనుభూతి.

## కైట్ బీచ్

దుబాయ్ బీచ్‌లల్లో అత్యంత ఆకర్షణీయమైన బీచ్ ఇది. మధ్యాహ్నం ఎండలో వెళ్ళినా ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది. ఇక్కడ చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. సముద్రం అలలతో ఆటలాడుకోవటం ఎంతో ఆనందాన్నిచ్చింది. వాటర్ స్పోర్ట్స్, ఫుడ్ కోర్ట్స్, కైట్లు ఎగిరెయ్యడం, బాగా ఎంజాయ్ చేసాం.

## గ్లోబల్ విలేజ్

ప్రపంచంలోని అన్ని సంస్కృతుల మిళితం ఈ గ్లోబల్ విలేజ్ ప్రత్యేకత. ఏ మూల చూసినా ఒక వినూత్న అనుభవం కలుగుతుంది. దాదాపు తొంభై దేశాల మార్కెట్స్, వంటకాలు, లేజర్ షో, సంగీతం, వినోదభరితంగా, వారి వారి సంస్కృతిని ప్రతిబింబించే ప్రదర్శనలు.. ఇలా అంతా మరో ప్రపంచంలా అనిపించింది. ఇది షాపింగ్‌లకు, సరదాలకు అనువైన ప్రదేశం.

## బ్యాప్స్ హిందూ మందిర్

అబుదాబీ స్వామీ నారాయణ్ సంస్థ నిర్మించిన మొదటి హిందూ దేవాలయమిది. ఈ మందిరం సర్వమత సామరస్యానికి చిహ్నం, వివిధ మత నేపథ్యాల ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడానికి, యు.ఎ.యి, భారతదేశం మంచి సంబంధాలకు రుజువు. ఇక్కడ హిందూ సంప్రదాయంతో పాటు ఈజిప్టియన్, అరేబియన్, అమెరికన్ ఇతర సంప్రదాయాల అంశాలను ఏర్పాటు చేయటం విశేషం! ప్రతిరోజు రాత్రి 7.30 ని.కు ప్రదర్శించే 'గంగా హారతి' మా మనసును కట్టి పడేసింది.



## పామ్ మోనో రైల్

పామ్ మోనోరైల్‌లో పామ్ జుమైరా పొడవునా పామ్ అట్లాంటిస్ వరకు సుందరమైన ప్రయాణమిది. నగరంలో అత్యంత ప్రసిద్ధ మానవ నిర్మిత ద్వీపం, ఐకానిక్ దుబాయ్ పరిసర ప్రాంతం.

అరేబియన్ గల్ఫ్ సముద్రపు వ్యూను చూస్తూ ప్రతిచోట ఆశ్చర్యకరమైన మైలు రాళ్ళను అన్వేషిస్తూ ప్రయాణించడం ఒక మరపురాని అనుభూతి. పామ్ మోనో రైల్, పామ్ జుమేరా ప్రవేశద్వారం వద్ద గేట్‌వే స్టేషన్ నుండి ప్రారంభమయ్యే పామ్ జుమైరా ముఖ్య ల్యాండ్ మార్క్‌లను, గోల్డెన్ మైల్ గల్లెరియా, నఖీల్ మాల్ ప్రయాణం చివరి స్టాప్‌లోని అట్లాంటిస్ ఆక్వావెంచర్ స్టేషన్‌లను కలిపే సమాహారం.

## షేక్ జాయెద్ గ్రాండ్ మసీదు

యు.ఎ.ఇ రాజధాని అబుదాబి నగరంలో ఉన్న ఈ మసీదు ప్రపంచంలోకెల్లా అతి పెద్దదని చెప్పవచ్చు. ఇది రోజువారీ ఇస్లామిక్ ప్రార్థనల కోసం నిర్మించిన ప్రధాన ప్రార్థనా స్థలం.

## జిప్ లైనింగ్

సాహసం చేయాలనుకునే వారికి, జెబెల్ జైస్ ఫ్లైట్ ప్రపంచంలోనే అతి పొడవైన జిప్ లైన్, దీని పొడవు 2.8 కిలోమీటర్లు. జెబెల్ జైస్ విభిన్న క్యాంపింగ్ సైట్‌లు, సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రత్యేక క్యాంపింగ్ అనుభవాన్ని కూడా అందిస్తుంది.



ఇలాంటిదే ఎక్స్ లైన్ దుబాయ్, దుబాయ్ మెరీనాలో ఉన్న అతి పెద్ద అర్బన్ జిప్ లైన్. దీని పొడవు 1 కి.మీ. 170 మీటర్ల ఎత్తులో అతి వేగంగా స్పాన్సర్ల సహాయంతో ఫ్లైట్ ఆకారంలో బోర్లా పడుకుని గట్టిగా పట్టుకుని జిప్ చేస్తూ కింద ఉన్న దుబాయ్ నగర సుందర దృశ్యాలను ఆస్వాదించవచ్చు.

## నవ్వుల్... రువ్వుల్...

గృహిణి: ఏమైంది? ఈ మధ్య మా ఇంటి ముందునుండే వెళ్తూ మా ఇంటికి రావడం మానేసావు? అడిగింది యాచకుడిని.

యాచకుడు: మీరు ఈ మధ్య టీవీ సీరియల్స్,



వాట్సాప్ ధ్యాసలో పడి వంట బాగా చేయట్లేదు. అందుకని రావడం లేదమ్మా, వెరీ సారీ.

...............

సర్వర్: ముందు ఆర్డర్ చెప్పండి, తర్వాత మంచినీళ్లు.

కస్టమర్: ఎందుకని?

సర్వర్: కొంతమంది మంచినీళ్లు తాగి ఆర్డర్ ఇవ్వకుండా వెళ్లిపోతున్నారు.

...............

సుబ్బారావు: ఏం అప్పారావ్, పండక్కి అత్తవారింటికి వెళ్లలేదా?

అప్పారావు: వెళ్లలేదు సుబ్బారావ్, వెళ్లిన వెంటనే మా మామయ్య మందుబాటిల్ తెచ్చావా? లేదా? అడుగుతాడు.

...............

చెల్లి: అక్కా, నీ చీరెలు ఎవరు ఉతుకుతున్నారు? చాలా తెల్లగా వుయిన్నాయి. అడ్రస్ చెబితే నేనూ అక్కడే ఇస్తాను.

అక్క: బావగారు ఒప్పుకోరు.

చెల్లి: ఆయనకెందుకు అభ్యంతరం?

అక్క: నా చీరెలు ఉతికేది ఆయనేగా మరి.

...............

ఆడకుక్క: నువ్వు గజదొంగ భీమయ్య ఇంటికెళ్లిన తరువాత బాగా మారిపోయావు. నా గురించి పూర్తిగా మరిచిపోయావు.

మగకుక్క: అలా అనకు. మా బాస్ లేనప్పుడు అప్పుడప్పుడు వస్తుంటాను.

ఆడకుక్క: అలా అయితే అవసరం లేదు. బాస్‌కు భయపడేవాడు నాకు అక్కరలేదు.

– వైదా ఈశ్వరరావు, విశాఖ

టీచర్: చింటూ, ఒళ్లంతా ఆ గాయాలేంటి?

చింటూ: మీరేగా టీచర్ కుక్క మీద వ్యాసం రాసుకుని తెమ్మన్నారు. కుక్క మీద వ్యాసం రాస్తుంటే కరిచింది.

...............

భర్త: ఎక్కాడున్నావే? నన్ను పాము కరిచింది.

భార్య: కొద్దిసేపు ఆగండి. పతియే ప్రత్యక్ష దైవం పుస్తకం చదువుతున్నాను. చివరకొచ్చింది. అది పూర్తవగానే వస్తాను. అంతవరకు కాస్త ఓర్చుకోండి.

– మాకరాజు శ్రీనివాసరాజు, పాల్వంచ

"బుద్ధి వున్నవాడు ఎవరూ పెళ్లి చేసుకోడు" అన్నాడు భర్త.

"అయితే ఎందుకు చేసుకున్నారు?" విసురుగా అంది భార్య.

"ఆ విషయం పెళ్లి అయ్యాకే తెలిసింది" అన్నాడు బత్త.

ఆవిడ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ కిచెన్‌లోకి వెళ్లింది.

...............

"ఆ ఇంట్లో అద్దెకు దిగుతున్నారు. భయం లేదా?" అన్నాడు మొదటి వ్యక్తి.

"భయం దేనికి?"

"ఆ ఇంట్లో దెయ్యాలున్నాయని చుట్టుపక్కలవాళ్లు అంటుంటారు"

"మా ఆవిడ పక్కనుండగా నాకు ఎలాంటి భయం లేదు"

– టి.సదాశివరెడ్డి, పెరుమాళ్లపల్లి

# అరుదైన ఆలయం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

మహా పాశుపత బంధ ఆలయాల వరుసలో రెండవది శ్రీ అగస్తేశ్వర స్వామి కొలువైన నంది వెలుగు. మొదటిదైన కొలకలూరుకు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఎంతో చరిత్ర కలిగిన ప్రదేశం. యుగాల నాటి చరిత్రకు ప్రత్యక్ష రూపం నందివెలుగు గ్రామంలోని శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయం.

## పేరు వెనుక గాథ

శ్రీ అగస్త్య మహర్షి తాను ప్రతిష్టించిన లింగానికి పూజాదులు చేయడానికి స్థానిక పండితులను నియమించి వెళ్లిపోయారట. యుగాలు, తరాలు మారిపోయాయి. అలా కాలక్రమంలో ఆలయం శిథిలావస్థకు చేరుకొన్నది. ఎందరో పాలకులు ఆలయాన్ని పునఃనిర్మించారు. చివరగా చాళుక్య రాజులు ఈ ప్రాంత సందర్శనకు వచ్చారట. ఆలయ విశేషాలు విని తమ కుల గురువైన శ్రీ అగస్త్య మహర్షి ప్రతిష్టించిన లింగానికి అరుదైన, సాటిలేని ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయం చేసుకున్నారట. నిపుణులైన శిల్పులు గొప్ప ప్రభావతంగా ఆలయాన్ని నిర్మించారట.

## ఆలయంలోని విశేషాలు

తూర్పు ముఖంగా నిర్మించిన ఆలయానికి దక్షిణాన ప్రవేశ ద్వారం ఉంటుంది. అక్కడ ఒక పెద్ద గణపతిని ప్రతిష్టించారట. ముఖ మండపంలో పెద్ద నందిని ఏర్పాటు చేశారు. ఉషోదయపు సూర్య కిరణాలు గణపతి విగ్రహం మీద పడినప్పుడు వినాయకుని ఉదరంలో ఉంచిన వజ్ర, రత్న మాణిక్యాల కాంతి ఎదురుగా ఉన్న నంది విగ్రహం మీద ప్రతిఫలించేవట. అప్పుడు నంది కొమ్ములలో ఉంచిన వజ్రవైఢూర్యాల కాంతి గర్భాలయంలోని లింగం మీద ప్రతిఫలించేవట.



అద్భుతమైన నిర్మాణ చాతుర్యం, వెలుగులు చిమ్మే వక్రతుండుని రత్నగర్భ గణపతి అని, కాంతులు వెదజల్లే నందిని జ్యోతిర్నంది అని పిలిచేవారట. వెలుగు చిమ్మే జ్యోతిర్నంది ఉన్నందున ఈ గ్రామానికి నంది వెలుగు అన్న పేరు వచ్చినట్లుగా తెలుస్తోంది. కానీ కొంత కాలానికి కాశీ నుండి ఒక సిద్ధుడు వచ్చి ఆలయంలో ఉండసాగాడట. ఇప్పుడంటే ఎన్నో నిబంధనలు ఉన్నాయి. అప్పట్లో సాధు సిద్ధుల మకాం ఆలయాలలోనే! అలా ఆలయంలో ఉండే సిద్ధుడు ప్రతి నిత్య గణపతికి బెల్లం నివేదన చేసి దానిని విగ్రహం పొట్టకు రాసేవాడట. కొంత కాలానికి చీమలు పట్టడం వలన శిల బలహీనపడి పగిలిపోయిందట. అందులో ఉంచిన వజ్ర రత్న మాణిక్యాలను తీసుకొని వెళుతున్న సిద్ధుడు ఆలయ ప్రాంగణం దాటగానే ప్రాణం విడిచాడట. సిద్ధుడు ఇలా చేయడానికి గల కారణం కాశీలోని ఒక ఆలయంలో నంది వెలుగులోని రత్న గర్భ గణపతి, జ్యోతిర్నందుల గురించి తెలిపే ఒక శాసనం గుప్త భాషలో సంకేతాలతో కూడినది ఉన్నదట. చాల క్లిష్టంగా ఉన్న శాసనాన్ని అర్థం చేసుకొని అందులో రాసిన ప్రకారం కృష్ణా తీరంలో నాలుగు వాడలు అయిన బెజవాడ, గుడివాడ, పువ్వాడ–గోవాడల మధ్య నెలకొని ఉన్న నంది వెలుగు గ్రామానికి వచ్చాడట ఆ సిద్ధుడు. అతని ముఖ్యోద్దేశం గణపతి, నంది విగ్రహాలలో ఉన్న రత్నాలను అపహరించడం. కానీ ఆలయం నుండి వెలుపలికి రాగానే ఆలయానికి కావలిగా ఉన్న శ్రీ గంగానమ్మ, శ్రీ పోతురాజు అతనిని సంహరించారు అని నమ్ముతారు ప్రజలు. దానికి నిదర్శనంగా ఆలయానికి వెలుపల వట వృక్షం క్రింద శ్రీ గంగానమ్మ, శ్రీ పోతురాజులను ప్రతిష్టించారు. నేటికీ ఆలయంలో భిన్నమైన రత్నగర్భ గణపతి విగ్రహం తాలూకు చిహ్నాలు కనిపిస్తాయి.

తూర్పు ముఖంగా ఉన్న ఆలయానికి ఎలాంటి రాజగోపురం ఉండదు. ద్వారం గుండా లోపలికి వెళితే ప్రాంగణం అంతా దేవతా వృక్షాలైన రుద్రాక్ష, మారేడు, పారిజాతం, గన్నేరు, వేప, రావి, జమ్మి చెట్లతో నిండి ఉంటుంది. చిన్న ప్రాంగణంలో నవగ్రహ మండపంతో పాటు ఎనిమిది సన్నిధులు ఉంటాయి. గతంలో చెప్పుకున్నట్లుగా శ్రీ అగస్త్య మహర్షి దక్షిణా పథానికి వచ్చినప్పుడు అనేక ప్రాంతాలలో శివలింగాలను ప్రతిష్టించారు. ఇక్కడ కొలువైన లింగరాజును కూడా మహాముని ప్రతిష్టించారు. కనుకనే శ్రీ అగస్తేశ్వర స్వామి అని పిలుస్తారు. కృష్ణా తీరంలో గమనించవలసిన అంశం ఒకటి ఉన్నది. అధిక శాతం శివాలయాలు శ్రీ గంగా సమేత అని ఉంటాయి. కానీ ఆలయంలో గంగాదేవి సన్నిధి ఉండదు. కారణం ఏమిటంటే జలం గంగాదేవి రూపం. గంగాదేవి స్థానం గంగాధరుని శిరస్సు. ఈ ఆలయాలు పావన కృష్ణవేణీ నదీతీరంలో ఉండటం కూడా ముఖ్య కారణం.

ప్రాంగణంలోని ముఖ మండపంలోనికి వెళ్లగానే మన కుడి పక్కన రత్న గర్భ గణపతి స్థానంలో ప్రతిష్టించిన వినాయక సన్నిధి కనపడుతుంది. అందులో గతంలో ఉన్న రత్నగర్భ గణపతి తాలూకు హస్తం, పిడికిలి కనపడతాయి. దానిని బట్టి రత్నగర్భ గణపతి విగ్రహం ఎంత పెద్దగా ఉండేదో ఊహించుకోవచ్చు. వినాయక సన్నిధికి ఎదురుగా ముఖ మండపంలో వర్ణమయ శోభిత నందీశ్వరుడు ఉపస్థితులై తదేక దృష్టితో గర్భాలయం వైపుకు చుస్తుంటారు. గతంలో ఉండిన జ్యోతిర్నంది భిన్నమైన తరువాత అదేవిధమైన నందిని ప్రతిష్టించారని చెబుతారు.

నందీశ్వరునికి మొక్కి అనుమతి తీసుకొని ప్రదక్షిణ చేసే క్రమంలో ముఖమండపంలో శివమతాచార్యుల గురుపరంపరకు చెందిన శ్రీ శ్రీ కంఠ శివాచార్యుల సన్నిధి ఉంటుంది. పదకొండవ శతాబ్దంలో కర్ణాటకలో జన్మించిన వీరు శివ ఆరాధనలో అనుసరించవలసిన శివాగమన సిద్ధాంతాలను రూపొందించారని చెబుతారు.

## ఉపాలయాలు

ప్రాంగణం దక్షిణ వైపున రుద్రాంశ సంభూతుడైన శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధి, ఎదురుగా నిలువెత్తు శ్రీ నటరాజ స్వామి సన్నిధి ఉంటుంది. ఈ విగ్రహం అటు ఉత్తరం పక్కన ఉన్న శ్రీ కనకదుర్గా దేవి విగ్రహం రెండూ మూడు వందల సం॥ మానూరు జమీందారులు ఆలయాన్ని అభివృద్ధికి సన్నాహాలు చేస్తున్న సమయంలో లభించాయట. పడమర వైపున కలియుగ వరదుడైన శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధి ఉంటుంది. ఈ ఆలయంలో కూడా శ్రీ చెండికేశ్వర స్వామి గోముఖి వద్ద ఉపస్థితులై ఉంటారు. శ్రీ చండికేశ్వర స్వామి దర్శనంతోనే శివాలయ సందర్శనా ఫలితం దక్కుతుందని విశ్వాసం. ఆయన సన్నిధి వద్ద చప్పట్లు కొట్టి గోత్రనామాలు చెప్పుకోవడం ఒక ఆచారంగా రూపుదిద్దుకొన్నది.

శ్రీ కనకదుర్గా దేవి సన్నిధి ఉత్తర ముఖంగా ఉంటుంది. అమ్మవారు శోభాయమానమైన అలంకరణలో నేత్రపర్వంగా దర్శనం అనుగ్రహిస్తారు. ఇంకా ప్రాంగణంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ వీరభద్ర, శ్రీ కాలభైరవ, జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల సన్నిధులు ఉంటాయి. ప్రతి శివాలయంలో కనిపించే నవగ్రహ మండపం కూడా ఆలయ ఈశాన్యంలో కనపడుతుంది.

గర్భాలయ ద్వారం పైభాగాన మహా పాశుపత బంధ





క్షేత్రాలకు మూలమైన ధనుస్సు ఇక్కడ చెక్కబడి ఉంటుంది. వెనుక భాగాన గోడ మీద దానికి సంబంధించిన బ్రాహ్మి లిపిలో రాసిన శాసనం కనిపిస్తాయి. గర్భాలయానికి ఇరుపక్కలా శ్రీ గణపతి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఉపస్థితులై దర్శనమిస్తారు. ఎత్తైన పానువట్టం మీద శ్రీ అగస్త్యేశ్వర స్వామి తెల్లని లింగరూపంలో చందన, కుంకుమ, విభూతి లేపనాలతో, చక్కని పుష్ప అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిస్తారు. అర్ధమండపంలో శ్రీ పార్వతీదేవి చిన్న సన్నిధిలో దక్షిణాముఖిగా కొలువై ఉంటారు. ఈ ఆలయంలో అమావాస్యకు, పౌర్ణమికి, మాస శివరాత్రికి ప్రత్యేక పూజలు జరుపుతారు. శ్రీ గణేశ, శ్రీ దుర్గా నవరాత్రులు, శ్రీ సుబ్రహ్మణ్య షష్టి, శ్రీశ్రీకంఠ శివాచార్య జయంతి, జగద్గురు శ్రీ శ్రీ శ్రీ ఆదిశంకర జయంతి కూడా విధిగా నిర్వహిస్తారు. శ్రావణమాసం, కార్తికమాసంలో విశేష పూజలు, అభిషేకాలు విశేషంగా జరుగుతాయి. మహా శివరాత్రి రంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.

ఈ క్షేత్రం నంది వెలుగుగా ప్రసిద్ధి చెందడానికి జ్యోతిర్నంది రత్నగర్భ గణపతి కాకుండా మరో కారణం కూడా ఉన్నది. మహా పాశుపత బంధ ఆలయాలలో కొలకలూరు చంద్రకళ కాగా నంది వెలుగు అగ్ని కళ. అగ్ని క్షేత్రాలకు ప్రత్యేక శక్తి, తేజస్సు ఉంటాయి. అందుకే వాటికి అధిక ఆకర్షణ ఉంటుంది. అదే విధంగా అస్త్రం అంటే ఒక క్షిపిణి.

నందివెలుగులోని రామాలయం చాలా పురాతనమైనది. కొన్ని వందల సంవత్సరాల క్రిందట బుదకౌశిక మహర్షి కృష్ణా తీరంలో శ్రీరామచంద్ర మూర్తిని దర్శించుకోవాలని తపస్సు చేశారట. అప్పుడు ఆయన ఒక శ్రీ సీతారాముల విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్టించారట. కాలక్రమంలో ఆయన నిర్మించిన మందిరం, ప్రతిష్టించిన విగ్రహాలు భూగర్భంలో కలిసిపోయాయి. వీరు శ్రీరామరక్షా స్తోత్రం రచించారని చెబుతారు. మానూరు జమిందారులు గృహనిర్మాణం కొరకు పునాదులు తవ్విస్తున్నప్పుడు ఈ సుందర విగ్రహాలు బయల్పడినాయని చెబుతారు. జమీందారులు ప్రస్తుత ఆలయాన్ని మూడు వందల సంవత్సరాల క్రితం నిర్మించారు. రాజగోపురం నుండి ప్రాంగణంలోని ప్రవేశిస్తే ఎదురుగా ధ్వజస్థంభం, గరుడ స్థంభం కనపడతాయి. గరుడ స్థంభం కూడా తవ్వకాలలో లభించిందే! కానీ ఇక్కడ లక్ష్మణుడు ఉండడు, శంఖు చక్రాలు కూడా కనిపించవు. గర్భాలయంలో అత్యంత సుందర రూపంలో ఉన్న సీతారాములకు రమణీయమైన వస్త్ర, ఆభరణ, పుష్ప అలంకరణ చేస్తారు. శ్రీ మహా విష్ణువు అలంకార ప్రియుడు అంటారు కదా. ఇలాంటి ప్రత్యేక అలంకరణలో అర్చనామూర్తులు మరింత దేదీప్యమైన తేజస్సుతో దర్శనమిస్తారు. ఎదురుగా ఉన్న మరో సన్నిధిలో శ్రీ చింతామణి ఆంజనేయుడు దర్శనమిస్తారు. ఇక్కడి ప్రత్యేకతలు ఏమిటంటే సహజంగా ఆంజనేయ ఆలయాలలో వానరులు ద్వారపాలకులుగా కనపడతారు. చిత్రంగా ఇక్కడ కీర్తనకారులు ఉంటారు.

చిన్న గర్భాలయంలో శ్రీ హనుమంతుడు స్థానక భంగిమలో కొలువై ఉంటారు. స్వామి రూపం చింతామణి శిల మీద చెక్కబడినందున స్వామి వారు భక్తుల కోరికలను నెరవేర్చేవానిగా ప్రసిద్ధి. స్వామిని శ్రీ ముఖ్య ప్రాణమూర్తి అని పిలుస్తారు. వాయుదేవుడు, భీమసేనుడు, మధ్వాచార్యుల అంశలు ఈ విగ్రహంలో ఉన్నాయని చెబుతారు. ఈ విగ్రహాన్ని పదమూడవ శతాబ్దానికి చెందిన మధ్వాచార్యుల శిష్యులలో ఒకరైన శ్రీ నరహరి తీర్థులు ప్రతిష్టించారని తెలుస్తోంది. గర్భాలయంలో శ్రీ ఆంజనేయునితో పాటు శ్రీ మధ్వాచార్యులు కూడా దర్శనమిస్తారు.

ఇక్కడ ఉన్న రెండు ఆలయాలలో రెండు సాంప్రదాయాలను పాటిస్తారు. శ్రీ రామాలయంలో వైఖానస విధానం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో మధ్వ సాంప్రదాయం ప్రకారం పూజాదులు నిర్వహిస్తారు. మరో విశేషం ఏమిటంటే శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి, మధ్వాచార్య జయంతి, మధ్వ నవమితో పాటు భీమసేన జయంతి జరుపుతారు. కారణం శ్రీ ముఖ్య ప్రాణమూర్తిలో భీమసేనుని అంశ కూడా ఉండటం. ఇలా భీమసేనుని జయంతి జరిపే ఒకే ఒక్క ఆలయం శ్రీ ఆంజనేయ, శ్రీ రామాలయం, నంది వెలుగుగా చెప్పవచ్చు. శ్రీరామ నవమి, ఉగాది, శ్రీకృష్ణాష్టమి, ఇతర హిందూ పర్వదినాలను పెద్దఎత్తున నిర్వహిస్తారు.

## ఎలా వెళ్లాలి?

నందివెలుగు తెనాలికి పది కి.మీ. దూరంలో ఉన్నది. గుంటూరు, విజయవాడల నుండి సులభంగా చేరుకోవచ్చు. తెనాలిలో అన్ని వసతి సౌకర్యాలు లభిస్తాయి.

# జనవరి 26, 2025 నుండి ఫిబ్రవరి 1, 2025 వరకు



## వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795



### మేషం

ఈ వారం మానసికంగా శారీరకంగా మీరు పడుతున్న వేదన ఎవరికీ కనపడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. కుటుంబ పరమైన బరువు బాధ్యతలు పంచుకోవడానికి కొంతమంది ముందుకు రావడం మానసిక సంతోషానికి ధైర్యానికి కారణం అవుతుంది. నూతన పెట్టుబడులు అంతంతమాత్రంగా ఉంటాయి. ఎంతో కష్టపడి విద్యాభ్యాసాని పూర్తి చేయడానికి ప్రయత్నిస్తారు.



### వృషభం

ఈ వారం కళా సాంస్కృతిక రంగాల్లో ఉన్న వారికి కాలం అనుకూలంగా ఉంటుంది. గౌరవప్రదమైన సత్కారాలు సన్మానాలు ప్రశంసలను అందుకో గలుగుతారు. వృత్తిపరమైన బరువు బాధ్యత మరింత పెరుగుతాయి. సర్వ రక్ష చూర్ణము సర్పదోష నివారణ చూర్ణము కలిపి స్నానమాచరించండి. వివాహ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన శుభకార్యాలకు సంబంధించిన ప్రస్తావన ముడి పడుతుంది. కార్యక్రమాల గురించి మాటలు జరుగుతాయి.



### మిథునం

ఈ వారం అయిన వాళ్ళు ఏర్పడినటువంటి తగాదాలు పరిష్కరించుకోవడానికి శుభకార్యాలను సద్వినియోగం చేసుకోగలుగుతారు. వాతావరణంలో వచ్చే మార్పుల కారణంగా ఉష్ణ సంబంధమైన అనారోగ్యాలు ఏర్పడతాయి చర్మ వ్యాధి ఏర్పడే అవకాశం ఉంది, నిర్లక్ష్యం పనికిరాదు. ప్రతిరోజు దేవి దేవతలకు ప్రథమ తాంబూలాన్ని సమర్పించండి. రాజకీయాల్లో ఉన్న వారితో పరిచయం పెంచుకుంటారు.



### కర్కాటకం

ఈ వారం స్థిరాస్తి సంబంధమైన విషయాలు అనుకూలిస్తాయి. భూ సంబంధమైన క్రయవిక్రయాలలో మంచి లాభాలను అందుకో గలుగుతారు. సుమంగళి పసుపు తో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. కొన్ని అసత్య ప్రచారాలు విమర్శలను ఎదుర్కోవాల్సి పరిస్థితులు ఏర్పడతాయి.కొత్త వ్యాపారాలు ప్రారంభించాలన్న ఆలోచనలు కలసి వస్తాయి. నూతన విద్యా అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.



### సింహం

ఈ వారం విదేశాలకు వెళ్లి చదువుకోవాలన్న ఆలోచనలు విరమించుకుంటారు. ఆర్థిక స్తోమత అందుకు సహకరించక ఇక్కడే చదువుకోవాలని నిర్ణయం తీసుకుంటారు. స్నేహితులతో గురువులతో సఖ్యత కలిగి ఉంటారు. బంధువులతో పరిచయాలు మరింతగా పెరుగుతాయి. సిద్ధ గంధంతో శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి అర్చన జరిపించండి. కొత్త కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. ఇంపోర్ట్స్ ఎక్స్పోర్ట్స్ వ్యాపారస్తులకి చిక్కులు ఎదురవుతాయి.



### కన్య

ఈ వారం ఫార్మా కంపెనీలో పనిచేసే వారికి మంచి అవకాశాలు ఏర్పడతాయి. నిద్ర భంగం వాటిల్లుతుంది. జీవిత భాగస్వామి తీసుకున్న నిర్ణయాలు మీకు ఏమాత్రం నచ్చవు ఎంతో ఓర్పుతో సహించి మంచి సలహాలు సూచనలు మీరు ఇచ్చినప్పటికీ వారు అవి తిరస్కరించటం వల్ల కొత్త సమస్యలు ఏర్పడతాయి. అష్టమూలికా తైలంతో లక్ష్మి తామర వత్తులతో దీపారాధన చేయండి. నూతన ఉద్యోగ అవకాశాలు ఇవ్వగలిగే స్థాయికి మీరు చేరడం మీ మానసిక ధైర్యానికి కారణమవుతుంది.



### తుల

ఈ వారం కొంతకాలంగా మదన పడుతున్న సమస్యల నుంచి మెల్లమెల్లగా బయటకు రాగలుగుతారు. దూరప్రాంత ప్రయాణాలు అంతంత మాత్రంగా ఉంటాయి. తాత్కాలికంగా వాయిదా వెసుకుంటే అన్ని విధాలా మంచిది. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. తాతల ఆస్తి పట్ల ఆసక్తి కనబరుస్తారు. మీకు కూడా కొంత భాగం రాగలిగితే మీరు ఉన్న పరిస్థితికి అండగా నిలుస్తుందని భావిస్తారు. దీనికి సంబంధించి దాయాదులు తో సమస్యలు ఎదుర్కొనే పరిస్థితులు గోచరిస్తున్నాయి.



### వృశ్చికం

ఈ వారం ప్రభుత్వపరమైన లీజులు లైసెన్సులు టెండర్లు కలిసి వస్తాయి. పెండింగ్లో ఉన్న బిల్లు గురించి మంచి శుభవార్త వింటారు. కొత్త వాహనాన్ని కొనుగోలు చేయాలని ఆలోచన ముడి బడతాయి. మీ ఇష్టదేవుళ్లకు మహాతీర్థం పొడితో అభిషేకం చేయడండి. కొత్త వ్యక్తులతో పరిచయాలు కొన్ని ముఖ్యమైన విషయాలు గ్రహించగలుగుతారు. పక్కనే ఉండి వెన్నుపోటు పొడుస్తున్న స్నేహితులను మీరు గుర్తించగలుగుతారు. తగిన చర్యలు తీసుకుని జాగ్రత్తగా ఉండగలుగుతారు.



### ధనస్సు

ఈ వారం నూతన ఉద్యోగ ప్రయత్నాలు అంతంత మాత్రమే ఉంటాయి. చేయి దాకా వచ్చిన అవకాశాలు చేయి జారిపోవడం చేయి జారిపోతాయి. పసుపు వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. ఎంతో మందికి సహాయం చేసే వారు మీ దాకా వచ్చేసరికి వెనక్కి తిరుగుముఖం పడతారు. ఎదురుచూపుల ద్వారా నిరాశ ఎదురవుతుంది. కలం కి అనుకూలంగా ప్రేమ వివాహానికి ఒప్పుకుంటారు.



### మకరం

ఈ వారం ఎంతమంది ఎంత నిరుత్సాహపరిచిన మీ సంకల్ప బలంతో ముందుకి నడవగలుగుతారు. మంచి పరిస్థితులకు స్థాయికి చేరుకోగలుగుతారు. రాత్రికి రాత్రి ఎవరు కోటీశ్వరులు అవ్వలేరు కదా అందరూ మెల్లగా ఎదిగారు అదే కోణంలో మనం కూడా ఎదుగుతాము అన్న ధైర్యాన్ని కలిగి ఉంటారు. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి. మీ వాళ్ళకి మంచి మాటలు చెప్పి ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. ప్రత్యేకంగా వారి స్నేహితుల పట్ల మీకున్న అభిప్రాయాలు మారతాయి.



### కుంభం

ఈ వారం కుటుంబ శ్రేయస్సు కోరి వేరే ఊరికి వెళ్లాలి ఆలోచనలు కలసి వస్తాయి. కుటుంబ పరమైన బరువు బాధ్యతల గురించి అవగాహన కలిగి ఉంటారు. మీ శక్తి సామర్థ్యం మేరకు సహాయాన్ని అందిస్తారు. హనుమాన్ వత్తులతో అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. సహోదర సహోదరీ వర్గం వారి యొక్క భవిష్యత్తు గురించి చింతించవలసిన ఉంటుంది. అయిన వాళ్ళ ఉండి కూడా సహకరించలేకపోతున్నాము సహాయం అందించ లేకపోతున్నారు అన్ని దిగులు పడతారు.





### మీనం

ఈ వారం మీరంటే ఎంతగానో ఇష్టపడే వ్యక్తి పెళ్లి ప్రస్తావన మీ ముందు ఉంచుతారు. ఎంత ఆలోచించినప్పటికీ అంగీకరించడానికి కానీ నిరాకరించ డానికి కానీ మీకు ధైర్యం సరిపోదు. పెద్దల సమక్షంలో స్థిరాస్తి సంబంధమైన విషయాలు నిర్ణయాలు తెలుసుకోగలుగుతారు. ఇంట్లో వ్యాపార ప్రదేశాల్లో కప్పు సాంబ్రాణి దైవికం పొడితో ధూపం వేయండి నర దిష్టి తొలగిపోతుంది. ఆరోగ్య విషయంలో ఖచ్చితమైన జాగ్రత్తల అవసరం.

# ఈ వారం 'కార్టూన్స్'


'లొట్టపీసు' కేసే అనుకున్నా..!
Zakir...


పండక్కి కోడి పందెమో, ఎద్దుల పందెమో
ఆడాలి గానీ.. ఆవిడ తో పందెం వేసుకుంటావా...??
Zakir...


మట్టి బుర్రా..!! ఇంట్లో డాడీ ఉన్నారు..
వెళ్లి కార్ తీసుకుని రాపో... క్యాబ్ వాడికి
OTP చెప్పినట్లు OTP చెప్పి కార్ ఎక్కేస్తా...!!!
Zakir...



ఏడాది
పొడవునా పర్యాటకులతో
కళకళలాడే ఈ ఐలాండ్‌ను
బురానో ఐలాండ్ అంటారు. ఇది
ఇటలీలో ఉంది. ఇక్కడి వీధులు
రంగుల హరివిల్లులను
తలపిస్తాయి.



